శ్రీరస్తు　　　　　　　　　　శుభమస్తు

# పెండ్లి కానుక

(విశ్వ ధర్మపరిషత్ సహకారంతో)

వరుడు : **చి|| సాయిరామకృష్ణ**

వధువు : **చి||ల||సౌ|| శారద**

లగ్నము : శ్రీ వృషనామ సం||రము వైశాఖశుద్ధ ద్వాదశి
కర్కాటక లగ్నము.

ది.4-5-2001 శుక్రవారము ఉ||గం|| 10-55 ని||లకు

వేదిక : ఆర్యవైశ్య కళ్యాణ మండపము, గుడివాడ

కృతజ్ఞతా పూర్వక వందనములతో

**సాయిరామకృష్ణ**

# పాణిగ్రహణము

సంకలనము:
ముక్కామల జనార్దనశర్మ M.A.,

ప్రచురణ :
విశ్వధర్మపరిషత్ ప్రచార విభాగం
గుంటూరు

పాణిగ్రహణము
సంకలనము - ముక్కామల జనార్దనశర్మ M.A.,
ప్రథమ ముద్రణ 15-11-1992
ద్వితీయ ముద్రణ – 1-5-94
విశ్వధర్మ పరిషత్ ప్రచురించిన
ప్రథమ కుసుమము

ప్రతులు 1000

ప్రచురణ :
విశ్వధర్మపరిషత్
ప్రచార విభాగం - గుంటూరు

ప్రతులకు:
ముక్కామల జనార్దనశర్మ M.A.,
రిటైర్డ్ లెక్చరరు
విశ్వధర్మ పరిషత్ ప్రధాన కార్యదర్శి

H. No. 6-5-16, 5/4, అరండల్ పేట
గుంటూరు - 522 002

## విషయసూచిక

| | |
|---|---|
| ఒకమాట | 5 |
| వివాహ శబ్దార్థం | 9 |
| వివాహ భేదములు | 10 |
| వివాహమెందుకు? | 11 |
| గృహస్థాశ్రమ విశిష్టత | 13 |
| వివాహ ప్రశస్తి | 15 |
| వివాహవయస్సు, కన్యావరణం | 17 |
| కన్య ఎలావుండాలి | 18 |
| స్వీకరించదగని కన్య | 19 |
| వరుని లక్షణాలు , | 20 |
| కొన్ని సందేహాలు | 21 |
| గోదాన వ్రతం, స్నాతకం | 22 |
| సమావర్తనం, బంగారు ఆభరణాలు | 23 |
| కాశీయాత్ర, సంకల్పం | 24 |
| గణపతి పూజ, పుణ్యాహవాచనం, అంకురారోపణ | 25 |
| గౌరీపూజ, వరపూజ | 26 |
| గోత్ర ప్రవరలు, యజ్ఞోపవీతధారణ | 27 |
| మహాసంకల్పం, .....కొన్ని వివరాలు | 28, 30 |
| మంగళాష్టకాలు | 33 |
| కన్యాదానం | 34 |
| నాతిచరామి | 36 |
| తెరసెల్లా, సుముహూర్తం | 37 |

జీలకర్ర-బెల్లం 39
కాడిరంధ్రంగుండా నీరు వదలుట 40
అపాలకథ 41
యోక్త్రధారణ 42
మంగళసూత్రధారణ 43
తలంబ్రాలు 44
రక్షాబంధనం, బ్రహ్మముడి 47
ప్రధానహోమం 48
పాణిగ్రహణం 49
సప్తపది 51
లాజహోమం 53
ప్రవేశహోమం 54
సంప్రదానం 56
అరుంధతి నక్షత్ర దర్శనం 57
స్థాలీపాకం 58
ఔపాసన, గంధర్వస్థాపనం 59
శేషహోమం 60
నాకబలి 61
శచీపూజ 62
పాన్పు 63
అప్పగింతలు 64
ఆశీస్సులు, విశ్వధర్మ పరిషత్ 65



## ఒకమాట

మన ధర్మం సనాతనము, సార్వదేశికము, సార్వకాలికము, సార్వజనీనము, మహిమాన్వితము, సర్వోత్తమము, ఆచరణలో నిగ్గు తేలినది. ఈనాటికీ మనదేశం సంస్కృతి, ధర్మం, ఆధ్యాత్మికత, నీతి మొదలగు విషయాలలో ప్రపంచానికి గురుస్థానంలోనే వున్నది. శాంతి, సౌభ్రాతృత్వముల కొరకు ప్రపంచం భారతదేశం వైపు చూస్తున్నది. విజ్ఞానంలో కూడా గొప్పదే. అనేకమంది విదేశీయులు మన ప్రాచీన విశ్వవిద్యాలయాలలో శిక్షణ పొందారు. కాని నేటి మన స్థితి ఏమిటి? పరాయి పాలనలో మన జాతి ఆత్మ విస్మృతి చెందినది. తన గొప్పతనాన్ని, తన వారసత్వాన్ని మరచిపోయింది. పరాయివాళ్ళు రాసిన రాతలను నమ్మి తన అస్తిత్వాన్నే కోల్పోవుచున్నది. మన ఆచారాలు మూఢాచారాలని, మనవి గుడ్డి నమ్మకాలనీ, మనము అనాగరికులమనీ, విదేశీయులు మనకు అన్నీ నేర్పారని పాఠ్యపుస్తకాలలో రాసి మన పిల్లలచేత చదివించుచున్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కూడా మనలో చైతన్యం కనుపించుట లేదు. విదేశీయులు మన ఆచారాలను అధ్యయనం చేసి వాటి

లోని గొప్పదనాన్ని వారు మనకు చెపితేగాని నమ్మలేని స్థితిలో వున్నాము. వారు చెపితే అది మనకు వేదం. ఆత్మవిస్మృతిలో నున్న జాతిని జాగృతం చేయాలి. ఆత్మ ప్రబోధం కలిగించాలి. మన ఆచారాలలోని అంతరార్థాన్ని తెలియజేయాలి.

మనం పెళ్ళిళ్లు చేస్తున్నాం ఆడంబరంగా. డబ్బు ఖర్చు పెడుతున్నాం విరివిగా. అప్పులపాలౌతున్నాం తరచుగా. కట్నాలు, మర్యాదలు, లాంఛనాలు కావాలంటున్నాం అధికంగా. వాటి కొరకు అలకలు, తగాదాలు, వేధింపులు చూస్తున్నాం ఎక్కువగా. ఎందుకీ మంత్రాలు? ఏమిటి వీటి అర్థాలు? అని తెలుసుకుందామనే కోరిక వుంది తక్కువగా. ప్రయత్నం, కృషి జరగటల్లేదు పొర్తిగా. అందుకే మన ఆవేదన ఇంతగా.

వివాహ మహోత్సవ ఆహ్వానం అని అందరికీ పంపుతాం. కాని వివాహం ఉత్సవం కాదు. అది మానవుని వికాసానికి నిర్ధారించిన షోడశ సంస్కారాలలో ప్రధానమైనదని మనకు తెలియదు. సానపెట్టుట వలన వజ్రం ప్రకాశించినట్లు సంస్కారాలవల్ల ఆత్మ ప్రకాశిస్తుంది. జీవితం సార్థకం, సుఖవంతం, ఆనందమయం అవుతుంది. వివాహంలోని మంత్రాల అర్థం పరమార్థం తెలియక, ఏటోపిధం…



త్వరగా పూర్తిచేయండని పురోహితుని తొందరపెడుతూ వుంటాం. దానివల్ల మనమే నష్టపోతామని గ్రహించం. ఫోటోలు, వీడియోలు, విందులకు ప్రాధాన్యం యిస్తూ ముఖ్యమైన సంస్కారాన్ని విడిచిపెడుతున్నాం. ఫలితం బాగాలేదని బాధపడుతున్నాం.

మన ప్రాచీనమైన ఆచారాలలోని అంతరార్థాన్ని తెలియజెప్పి, అధునాతన శాస్త్ర విజ్ఞానంతో సమన్వయించి, వాటిని సరియైన పద్ధతిలో చక్కగా ఆచరింపజేయాలనే వుద్దేశ్యంతోనూ, వివాహ మంత్రాలకు అర్థం వివరించి నూతన వధూవరులు ఆదర్శ దంపతులుగా జీవితాన్ని గడిపేటట్లు చేయాలనే వుద్దేశ్యంతో ఈ చిన్న పుస్తకం కూర్చబడింది. వివాహాన్ని గురించి సమగ్ర వివరణ యిస్తే అదొక పెద్ద గ్రంథ మౌతుంది. దానిని కొని చదివే అవకాశం అందరకు లభించదు, అందుచేత స్థాలీపులాక న్యాయంగా కొన్ని ప్రధాన ఘట్టాలను గురించి సంక్షిప్తంగా తెలియజేసి పూర్తి వివరాలు తెలుసుకోవాలనే జిజ్ఞాస రేకెత్తించటమే ఈ చిరు పుస్తకము యొక్క లక్ష్యం. వివాహ సమయంలో చేతిగుడ్డలు, మరేవేవో పంచేబదులు ఈ పుస్తకాన్ని అందించినచో ఉభయపరములు సార్థకము గును. వివాహ స్వరూపాన్ని, దానిలోని మంత్రాల అర్థాన్ని,

పెండ్లిలో చేసే ప్రమాణాలను, వివాహ సమయంలో పండితునిచేత చెప్పించుట కూడా చాలామంచిది. దీనివల్ల జీవిత భాగస్వామితో ఎలా ప్రవర్తించాలో తెలుసుకొని ఆ ప్రకారం నడచుకొంటే మన సంసారాలు స్వర్గధామాలు, ఆనంద నిలయాలుగా మారుటలో ఏమాత్రం సందేహం లేదు. ఆడంబరాలు, ఆర్భాటాలు తగ్గించి, ఆచరణను, సంస్కారాన్ని పెంచండి. ఇది ఈనాటి అవశ్యకత.

అనేకమంది వ్రాసిన గ్రంథముల నుండి విషయసేకరణ జరిగినది. అందరికి హార్దిక కృతజ్ఞతాభి వందనాలు.

ఇట్లు
ముక్కామల జనార్ధనశర్మ



## పాణిగ్రహణము

శ్లో|| ఇయం సీతా మమ సుతా సహధర్మచరీ తవ |
ప్రతీచ్ఛ చైనాం భద్రం తే పాణిం గృహ్ణీష్వ పాణినా ||

శ్రీమద్రామాయణంలో జనక మహారాజు అంటాడు. ఓ రామచంద్రా! ఈ సీత నా కుమార్తె. నీకు సహధర్మచారిణిగా ఈమెను అర్పించుచున్నాను. ఈమె చేతిని పట్టుకొని ఈమెను స్వీకరింపుము. నీకు శుభమగు గాక!

పరస్పర తపస్సంపత్ఫలాయిత పరస్పరౌ |
ప్రపంచ మాతాపితరౌ ప్రాంచౌ జాయాపతీ స్తుమః ||

పార్వతీ పరమేశ్వరులు సనాతన దంపతులు. వారి దాంపత్యము తపస్సంపద యొక్క ఫలితము. ప్రపంచానికి తల్లిదండ్రులైన ఆ దంపతులకు నమస్కారములు.

వివాహ శబ్దార్థం : సంస్కృతంలో 'వహ' అనే ధాతువుకు 'వి' అనే ఉపసర్గను 'ఘఞ్' అనే ప్రత్యయాన్ని చేరిస్తే వి+వహ్+ఘఞ్ = వివాహః అనే పదం ఏర్పడింది. దీనికి అర్థం విశేష ప్రాపణం అనగా విశేషమైన (ప్రత్యేకమైన) సమర్పణం. ఈ పదానికి అనేక పర్యాయ పదాలున్నాయి. పరిణయం, ఉద్వాహం, కల్యాణం, పాణిగ్రహణం, పాణిపీడనం, పాణిబంధం, దారోప సంగ్రహణం,

దార పరిగ్రహం, దారకర్మ, దారక్రియ మొదలగునవి.

వివాహ భేదములు : మనువు వివాహ పద్ధతులను 8గా విభజించాడు.

బ్రాహ్మోదైవ స్తథైవార్షః ప్రాజాపత్యస్తథాஉసురః |
గాంధర్వో రాక్షసశ్చైవ పైశాచ శ్చాష్టమోஉధమః ||

1. బ్రాహ్మం 2. దైవం 3. ఆర్షం 4. ప్రాజాపత్యం 5. అసురం 6. గాంధర్వం 7. రాక్షసం 8. పైశాచం అని వివాహాలు ఎనిమిది రకాలు.

*1. బ్రాహ్మం :* అలంకరించిన కన్యను పండితుడు, శీలవంతుడు అయిన వరుని ఆహ్వానించి దానం చేస్తే బ్రాహ్మ వివాహమౌతుంది. (ఉదా : శాంతా ఋష్యశృంగుల వివాహం.)

*2. దైవం :* యజ్ఞంలో ఋత్విక్కుగా వున్న వారికి దక్షిణగా కన్యను ఇచ్చి వివాహం చేస్తే అది దైవ వివాహమౌతుంది.

*3. ఆర్షం :* వరుని నుండి గోవుల జంటను తీసుకొని కన్యను ఇవ్వటం ఆర్ష వివాహం. ఇది ఋషులలో ఎక్కువగా వుండేది గనుక ఆర్షం అయింది.

*4. ప్రాజాపత్యం :* వధూవరులిద్దరు కలిసి ధర్మాన్ని



ఆచరించండి అని చెప్పి కన్యాదానం చేయటం ప్రాజాపత్యం అవుతుంది. (ఉదా: సీతారాములు)

*5. అసురం :* వరుని వద్ద డబ్బు తీసుకుని కన్యను యిస్తే అది అసుర వివాహం. (ఉదా: కైకేయీ దశరథులు)

*6. గాంధర్వం :* పరస్పరం అనురాగంతో (మంత్ర విధానం లేకుండా) చేసుకునేది గాంధర్వ వివాహం. (ఉదా: శకుంతలా దుష్యంతులు)

*7. రాక్షసం :* యుద్ధం చేసి, కన్యను అపహరించి, ఎక్కడికో తీసుకువెళ్ళి చేసుకునే వివాహం రాక్షసం అంటారు. (ఉదా: మండోదరి రావణులు)

*8. పైశాచం :* కన్యను నిద్రావస్థలో అపహరించి చేసుకొన్నది పైశాచం. వీటిలో బ్రాహ్మం శ్రేష్ఠం, ప్రాజాపత్యం ధర్మబద్ధం, రాక్షసం, పైశాచం నిషిద్ధం.

వివాహమెందుకు? : ఈ ప్రశ్న చాలా ముఖ్యమైనది. దీనికి సమాధానం ప్రతివారూ తెలుసుకోవాలి. ప్రతి మనిషీ మూడు ఋణాలతో పుడతాడు.

1. ఋషిఋణం 2. దేవఋణం 3. పితౄణం.

ఈ ఋణాలను తీర్చటం ప్రతి వ్యక్తి యొక్క విధి. ఈ ఋణాలు తీర్చకపోతే మరల జన్మ ఎత్తవలసి వస్తుంది. మానవజన్మకు సార్థకత జన్మరాహిత్యం. కావున ప్రతివాడు ఋణ విముక్తుడు కావాలి. దానికి ఏమిటి మార్గం? మన పెద్దలు చెప్పారు - "బ్రహ్మచర్యేణ ఋషిభ్యః" "యజ్ఞేన దేవేభ్యః" "ప్రజయా పితృభ్యః" అని.

*1. ఋషి ఋణం :* బ్రహ్మచర్యం ద్వారా ఋషి ఋణం తీర్చాలి. అంటే బ్రహ్మచర్యంలో చేయవలసిన వేదాధ్యయనం చేయాలి. అలాగే పురాణాలు మొదలైన వాఙ్మయాన్ని అధ్యయనం చేసి తరువాత తరంవారికి వాటిని అందించటం ద్వారా ఈ ఋణాన్ని తీర్చుకోవాలి.

*2. దేవ ఋణం :* యజ్ఞ యాగాది క్రతువులు చేయటం, చేయించటం ద్వారా ఈ ఋణాన్ని తీర్చుకోవాలి. యజ్ఞం అంటే త్యాగం. యజ్ఞాలవల్ల దేవతలు తృప్తి చెందుతారు. సకాలంలో వర్షాలు కురుస్తాయి. పాడిపంటలు వృద్ధి చెందుతాయి. కరువు కాటకాలు తొలగిపోతాయి. నీరు, నిప్పు, గాలి, వెలుతురు, ఆహారాన్ని ప్రసాదిస్తున్న వారందరికీ మనమెంతో ఋణపడివున్నాం. కనుక ఆ ఋణాన్ని తీర్చకపోతే మనం కృతఘ్నులం అవుతాం.



*3. పితౄణం :* సత్సంతానాన్ని కనడం ద్వారా ఈ ఋణాన్ని తీర్చుకోవాలి. తల్లిదండ్రులు ప్రత్యక్ష దైవాలు, మనకు జన్మనిచ్చి పెంచి పోషించినవారు. వంశాన్ని అవిచ్ఛిన్నంగా కొనసాగించటం ద్వారా, పితృ దేవతలకు తర్పణాది క్రియలు నిర్వహించే యోగ్యులైన సంతానాన్ని కనడం ద్వారా పితౄణం తీర్చుకోవాలి. సంతానం కనాలంటే వివాహం చేసుకోవాలి గదా! "ప్రజాతంతుం మావ్యవత్సేత్సీః" అంటుంది వేదం. అంటే వంశపరంపరను త్రెంచవద్దు. వేదాధ్యయనం, యజ్ఞం చేయటం, సంతానము కనటం ఇవి మానవుడు తప్పనిసరిగా చేయవలసిన విధులుగా వేదం చెపుతున్నది. యజ్ఞాలలో పంచ యజ్ఞాలు విధిగా ప్రతి మనిషీ చేయాలి. అవి దేవ, మనుష్య, భూత, పితృ, బ్రహ్మ యజ్ఞాలు.

గృహస్థాశ్రమ విశిష్టత : 1. బ్రహ్మచర్య 2. గార్హస్థ్య 3. వానప్రస్థ 4. సన్యాస అని నాలుగు ఆశ్రమాలు. ఇవి మానవుని జీవితంలో నాలుగు దశలు.

బ్రహ్మచర్యం : గురుకులంలో, నియమ నిష్ఠలతో, వినయ విధేయతలతో విద్యను, విజ్ఞానాన్ని అధ్యయనం చేయటం, ఇది భావి జీవితానికి పునాదివంటిది.

గార్హస్థ్యం : జీవితంలో గృహస్థాశ్రమం చాలా ముఖ్యమైనది. మిగతా ఆశ్రమాల వారందరికి ఆధారభూతమైనది. అందుకే దీనిని "సర్వోపకార క్షమం" అన్నారు కాళిదాసు.

యథా మాతర మాశ్రిత్య సర్వే జీవన్తి జన్తవః |
తథా గృహస్థ మాశ్రిత్య సర్వే జీవన్తి మానవాః ||

తల్లిని పిల్లలు ఆశ్రయించినట్లు, మానవులు గృహస్థునాశ్రయించి జీవిస్తారు. బ్రహ్మచారులు, సాధువులు, సన్యాసులు, దీనులు, ఆర్తులు మొదలగు వారందరికే ఆశ్రయం ఇచ్చేది గృహస్థాశ్రమమే. కావున గృహస్థాశ్రమం చాలా బాధ్యతలతో కూడినది. ఇది సర్వోత్తమమైన ఆశ్రమము. ఇది సమాజానికి తల్లి వంటిది. అనాథలను ఆదుకోవలసిన బాధ్యత గృహస్థుపై నున్నది. వివాహం చేసుకోవడమే గృహస్థాశ్రమంలో ప్రవేశించడం. "గృహస్థుగా ఆధ్యాత్మిక సాధన చేయడం కోటలో వుండి యుద్ధం చేయడం - సన్యసించడమ్ కోట విడిచి యుద్ధానికి వెళ్ళడం. సంసార బాధ్యతే ఆధ్యాత్మిక సాధన. నీవుచేసే ప్రతిపనీ భగవత్సేవయనీ, భగవదాజ్ఞానుసారమేనని అనుకోగలిగితే ఈ సంసారం ప్రతిబంధకం కానేరదు" అంటుంది జిల్లెళ్ళమూడి అమ్మ.



3. వానప్రస్థం : కుటుంబానికి చెందిన బాధ్యతలన్నీ పిల్లలకు అప్పగించి వైరాగ్యాన్ని పెంచుకుంటూ, త్యాగభావనతో, భగవచ్చింతనతో, ఆధ్యాత్మిక జీవనాన్ని గడపటానికి వనాల్లో, ఆశ్రమాల్లో వుండటం, ఇది సన్యాసాశ్రమానికి సంసిద్ధం కావటానికి చేసే సాధన వంటిది.

4. సన్యాసం : రాగద్వేషాలు వదలి, ఆత్మ స్వరూపాన్ని తెలుసుకుని పరమానందంలో నిమగ్నమవటం, విశ్వమంతటిలో భగవచ్చైతన్యాన్ని చూడగలగటం, నివృత్తి మార్గంలో, త్యాగానికి ప్రతీకగా నిలవటం సన్యాసాశ్రమం.

వివాహ ప్రశస్తి : వివాహం వేడుక లేక ఉత్సవం కాదు. ఇది ఒక మహత్తర సంస్కారం. వివాహం ఏడేడు జన్మల అనుబంధం. "అందుకే వివాహాలు విధి నిర్ణీతాలు" అంటారు. "వివాహము, కామపరితృప్తికి, కేవలము సామాజికమైన ఆమోదము (licence or passport) కాదు. అది వైవాహిక జీవితాన్ని సంయమబద్ధంగా చేయటానికి ఏర్పాటుచేసిన ఒక సామాజిక వ్యవస్థ. అందుకనే వివాహము యొక్క అంతమందు వధూవరులు త్రిరాత్ర సంయమ వ్రతమును పాటించవలెను. నవదంపతులకు సంయమపాలన నేర్పుటయే ఈ నియమము యొక్క తాత్పర్యము. పారస్కర గృహ్య సూత్రం 1-8-21

"భారతీయుల ప్రేమ వివాహంతో ప్రారంభమౌతుంది. పాశ్చాత్యుల ప్రేమ వివాహంతో అంతమౌతుంది." అంటాడొక కవి. "ప్రాచీన భారతీయుల వివాహ పద్ధతి యందలి పవిత్రత, గౌరవము, ఆశయము, ఆదర్శము ప్రపంచమందలి ఏ ఇతర దేశములో గాని, మతములో గాని కనుపించదు". అంటుంది విదేశీవనిత అనిబిసెంటు. "కళంకరహితమైన మనస్సును కళంకరహితంగా మరొకరికి అర్పణ చేయటమే కల్యాణం, సర్వాన్నీ అనుభవిస్తూ సర్వాన్నీ విడిచిపెట్టేదే వివాహం. పతిని ఆధారంగా చేసుకుని పంచభూతాలను జయించినదే పతివ్రత" అంటుంది జిల్లెళ్ళమూడి అమ్మ. వివాహం వల్లనే మానవుని జీవితం పరిపూర్ణత్వాన్ని పొందుతుంది. పంచయజ్ఞాలు చేయటానికి గృహస్థే అర్హుడు. పురుషార్థాలు సాధించుటకు గృహస్థాశ్రమమే ఉత్తమమైనది. వివాహం నూరేండ్లపంట. జీవిత రథానికి దంపతులిరువురు చక్రాల వంటివారు. ఇద్దరూ సమానులే. భార్య సహధర్మచారిణి. వివాహమైన తరువాత స్త్రీ పురుషులు వేరుకారు 'దంపతు'లౌతారు. 'ధర్మప్రజాసంపత్యర్థం స్త్రియముద్వహే' ధర్మంతో కూడిన కామం ద్వారా సంతానాన్ని పొందుటకే వివాహం చేసుకుంటున్నాను అని సంకల్పం. కాళిదాసు కూడా "ప్రజాయై గృహమేధినామ్" సంతానం కొరకు మాత్రమే వివాహం



చేసుకొనేవారు అంటాడు. ఈ వివాహవ్యవస్థ లేకపోతే సమాజమెంత అస్తవ్యస్తమైపోతుందో చెప్పలేము.

వివాహ వయస్సు : వరునకు 25 సం||లు, వధువునకు 12 సం ||లు అని కొందరు, 15 సం||లు కనీసం వుండాలని మరికొందరు చెపుతున్నారు. స్త్రీ పురుషుల వయస్సు 15-25 అధమం, 20-40 సం||లు మధ్యమం 24-48 సం||లు ఉత్తమం అన్నారు. కాని ఈనాటి పరిస్థితులలో 18 సం||లు స్త్రీకి, 25 సం||లు పురుషునకు వుండటం మంచిది.

కన్యావరణం : అంటే మంచిలక్షణాలు గల కన్యను ఎంపిక చేసుకొనుట.

"సుహ్యాద స్సమవేతాన్ మంత్రవతో వరాన్ ప్రహిణుయాత్|"

బుద్ధిమంతులు, తెలివిగల నలుగురు మిత్రులను కన్యను వెదకుటకు పంపుతారు.

"ప్రసుగ్మంతాధియసానస్య సక్షణే వరేభిర్వరాగ్ం అభిష్రసీదత. అస్మాకమింద్ర ఉభయం జుజోషతి యత్సౌంమ్యస్యాంధసో బుబోధతి, అన్నక్షరా ఋజవస్సంతు పంథాయేభిస్సఖా యోయంతినో వరేయమ్.

మీ ప్రయాణము సుఖకరమై ఫలప్రదమగుగాక అని కోరతారు. వీరు వెళ్ళి పిల్లవానికి సంబంధించిన వివరములు, మూడు తరాల వారి పరిచయం చేస్తారు. అలాగే పిల్లవైపు వారు "వరాన్వేషణ"కు మిత్రులను పంపుతారు. వారు కన్య వివరములు పిల్లవానివైపు వారికి తెలుపుతారు. తరువాత వివాహ నిర్ణయం జరుగుతుంది. ఈ నిర్ణయాలన్నీ ముందే జరిగినా సంప్రదాయంగా "వరాన్వేషణ" "కన్యావరణమునకు" మిత్రులకు తాంబూలాలు ఇస్తారు.

కన్య ఎలా వుండాలి: 1) సాముద్రిక శాస్త్రం ప్రకారం మంచి లక్షణాలు కలిగి వుండాలి. 2) సంతానాన్ని కనిపెంచటానికి తగినంత బలంగా, పుష్టిగా, ఆరోగ్యంగా వుండాలి. 3) సోదరులు కలిగి వుండాలి. 4) బాంధవ్యాన్నిబట్టి చెల్లెలు వరస కానిదిగా వుండాలి. 5) సగోత్రీకురాలు కారాదు (అనగా వధూవరులిద్దరిది ఒకే గోత్రం కాకూడదు). 6) బంధువులను చక్కగా చూడగలిగినదై వుండాలి. 7) రోగం లేనిదై వుండాలి. 8) సమాన గోత్రమే కాదు, ఋషులు కూడా సమానం కారాదు. 9) పది సంవత్సరాలు నిండని కన్య కావాలని ఆపస్తంబ ఋషి అంటాడు. దీని అర్థం చిన్నతనం



లోనే అత్తవారింట్లో వుంటూ వుంటే వారి అలవాట్లతో కలిసిపోయే అవకాశం ఉంటుందని. పెద్దయై భావాలు స్థిరపడిన తరువాత సర్దుబాటు చేసుకోవటం చాలా కష్టం. ఒక మొక్కను ఒకచోట నుండి తీసి మరియొకచోట నాటినచో చక్కగా పెరుగును. కాని ఒక చెట్టును తీసి మరియొకచోట నాటుట కష్టము. నాటిననూ అది బ్రతకదు. చిన్నవయస్సులోనే వివాహం జరుగుట వలన వారి ప్రేమ ఇతరులపై మరలక పరస్పరం క్రమముగా వృద్ధిచెందును. ప్రతివారిని ప్రేమించి భంగపడే అవసరం వుండదు. విదేశాలలో teen age పిల్లలలో ఈనాడు కామక్రీడలు పెరిగి సమస్యలు సృష్టిస్తున్నారు. 10 సం||ల లోపలనే కన్య వుండాలి అంటే వివాహమైనప్పటి నుండి సంతానాన్ని కనమని కాదు. సంయమనం పాటించడం అలవడుతుంది. 10) అన్నిటికంటె పిల్లను చూడగానే ముచ్చటగా వుందనిపించాలి.

స్వీకరించదగని కన్య : కన్యను చూచుటకు వెళ్ళినప్పుడు ఆమె నిద్రపోతున్నా, ఇంట్లో లేకపోయినా, దుఃఖంతో వున్నా ఆమెను స్వీకరించరాదు. కుష్ఠు, క్షయ మొదలగు రోగములు గల కుటుంబమునకు చెందిన కన్యనూ, శరీరముమీద రోమములు ఎక్కువగా వున్న

లేక_ అసలే లేకపోయినా పనికిరాదు. పిల్లి కన్నులుగల, అధిక అంగములు గల, అధిక ప్రసంగము చేయునట్టి, ఎప్పుడూ ఏడ్చునట్టి, ఎప్పుడూ నిద్రించునట్టి, వీధులలో తిరుగునట్టి, ఇతరులకు ఇస్తామని వాగ్దానం చేయబడినట్టి, నదుల, పర్వతాల, వృక్షముల పేర్లు కలిగిన, పేర్లలో చివర అక్షరానికి పూర్వమందు ర-ల అక్షరాలు గలిగియున్న కన్యను వివాహమాడరాదని స్మృతులు చెపుతున్నాయి. ఇంతేగాక ఈ క్రింద చెప్పిన వారిని కూడా విడువదగును.

దత్తాం, గుప్తాం, ఘోతాం, వృషభాం, వికటాం, వినతాం, ముండాం, మాండూషికాం, సాంకారికాం, వాతాం, పారీం చ వర్జయేత్. చాలా విలువైనది కనుకనే ఇన్ని పరీక్షలు చేసి చూసి కన్యను తెచ్చుకోవాలని భావం.

వరుని లక్షణాలు : "కులంచ, శీలంచ, సనాథతాచ, విత్తంచ, వపుర్వయశ్చ" మహాభారతం. వరుడు బ్రహ్మచారి అయివుండాలి, మంచి వంశంలో పుట్టి కులీనుడై యుండాలి. మంచి శీలము కలవాడు, సాముద్రిక శాస్త్రం ప్రకారం మంచి లక్షణాలు గలవాడు, బంధు సంపత్తి కలవాడు, పదిమంది మెచ్చే స్వభావం కలవాడు, ఆరోగ్యవంతుడు అందమైన, వయసులో వున్నవాడు, ధనవంతుడు, చదువుకున్నవాడు అయివుండాలి. దత్తతకు



వెళ్ళినవాడు, అందంగా లేనివాడు, సగోత్రుడు సంబంధానికి పనికిరాదు.

కన్యా వరయతే రూపం, మాతా విత్తం, పితాశ్రుతం |
బాంధవాః కుల మిచ్ఛంతి, మృష్టాన్న మితరే జనాః ||

కన్య వరుడు అందంగా వుండాలని, పిల్ల తల్లి డబ్బు వున్నవాడు కావాలని, పిల్ల తండ్రి చదువుకున్న వరుడు కావాలని, బంధువులు మంచి కుల గోత్రములు కలవాడై యుండాలని, ఇతరులు అందరితో కలిసిమెలసి వుండేవాడు, విందుకు పిలిచేవాడు కావాలని కోరతారు. ఈ శ్లోకంలో వరుని కుండవలసిన లక్షణాలు, మనంకోరేవి చెప్పబడ్డాయి.

కొన్ని సందేహాలు : 1. వివాహము దగ్గర వారితో చేసుకొనుట మంచిదా లేక దూరపు వాసులతోనా? "దుహితా, దుర్హితా, దూరేహితా భవతీతి" అనగా ఎంతదూర దేశమున వివాహము జరుగునో అంత మంచిది. 2. స్వగోత్రమందుగాని, పరస్పరం అన్నాచెల్లెళ్ళకు గాని వివాహం ఎందుకు చేయరాదు? దీనివలన ఒకరియెడల మరొకరికి ప్రేమకలగదు. దూరముగా వున్న వస్తువు యందు, సులభముగా లభ్యము కాని వస్తువు యందు, గల ప్రేమ దగ్గరి వానిపై వుండదు.

చిన్నతనము నుండి ఒకరి మంచి చెడులు మరియొకరికి తెలిసి యుండును. లోపములు తెలియుటచేత గౌరవ భావం తగ్గును. భయభక్తులు తక్కువగా వుండును. వేరువేరు గోత్రములవారి కలయిక వలన శరీరాదులు పుష్టిగా వుండును, పరిపూర్ణముగా వుండును. దూర సంబంధం వలన పరస్పర ప్రేమ పెరుగును. ఈనాడు సైంటిస్టులు చెప్పేది కూడా ఇదే. ఒకే Blood group వారు వివాహము చేసుకొనరాదని చెప్పుచున్నారు. దగ్గర బంధువులతో సంబంధం పనికిరాదని చెప్పుచున్నారు.

గోదాన వ్రతం : గురుకులంలో బ్రహ్మచర్యదీక్షతో విద్యాభ్యాసం చేసిన బ్రహ్మచారి ఆ దీక్షను విరమిస్తూ అప్పటి వరకూ పెంచిన గడ్డాలను, మీసాలను తీసివేయడమే గోదాన వ్రతం. గోశబ్దానికి గోవు, తలవెంట్రుకలు, అని రెండర్థాలున్నవి. క్షౌరకర్మను "ఆయుష్కర్మ" అంటారు. గోవును కూడా దానం చేయాలి. ఆయువు, వర్చస్సు, బలాభివృద్ధికోసం ఈ ముండనం చేస్తారు.

స్నాతకం : గురువుగారి వద్ద విద్యాభ్యాసం పూర్తి అయిన తరువాత గృహస్థాశ్రమంలో ప్రవేశించటానికి అనుమతి పొంది స్నాతకం చేసుకోవాలి. దీక్షను వదలి, క్షురకర్మ చేయించుకొని, వేడినీళ్లతో స్నానం చేసినవాడు



స్నాతుడౌతాడు. కావున దీనికి స్నాతకమని పేరు. దీనినే convocation అంటారు. గురువు దీక్షా విసర్జన సమయంలో శిష్యునకు అనేక ఉపదేశాలు చేస్తాడు. చక్కగా తీర్చిదిద్దిన శిష్యుని గురువు ఈ సమాజానికి అంకితం చేస్తాడు. ఈ స్నాతకోత్సవంలో గురుదక్షిణ సమర్పించి ఒక సంవత్సరం దేశాటన చేసివస్తాడు శిష్యుడు.

సమావర్తనం : విద్యాభ్యాసం పూర్తిచేసి స్నాతకవ్రతం చేపట్టిన ఒక సంవత్సరానికి స్నాతకుడు గురుకులం నుండి పాదయాత్రతో లౌకిక ప్రపంచంలోకి తిరిగి రావడాన్ని సమావర్తనం అంటారు. ఈ సందర్భంలో స్నాతకుడు ఆభరణాలు, ధోవతులు, గొడుగు, చెప్పులు, చేతికర్ర, పూలమాల, నలుగుపిండి, తలనూనె, కాటుక, తలపాగా మొదలగు వాటిని గురువుకు సమర్పించి తాను ధరిస్తాడు.

బంగారు ఆభరణాలు : స్నాతకంలో బంగారు ఆభరణాలు ధరింపచేస్తారు. తరగనిఛాయ, విలువగల బంగారు ఆభరణాలు ధరించుట వలన ఆయుష్షు, వర్చస్సు, ధనము, పుష్టి, సంపద జయము కలిగిస్తాయి. ఈ హిరణ్యధారణ వలన నూరు సంవత్సరముల వరకు ఆయువు ముసలితనము వరకు జీవించియుండునట్లు చేయునుగాక అని

మంత్రాల అర్థం.

**కాశీయాత్ర :** కాశీయాత్రకు బయలుదేరిన స్నాతకుణ్ణి కన్యాదాతగాని లేక కన్య సోదరుడుగాని "చక్కగా అలంకరించబడిన యోగ్యురాలైన మా కన్యను మీకిచ్చి వివాహం చేస్తాం. అగ్నిసాక్షిగా పాణిగ్రహణం చేయండి" అని ఆహ్వానిస్తాడు. అందుకు అంగీకరించి వస్తాడు వరుడు.

**సంకల్పం :** సంకల్పం అంటే ఏదైనా ఒక పనిచేయటానికి మనసులో కలిగిన భావన అని అర్థం. ప్రతిపని చేయబోయేముందు మనం ఎక్కడ? ఎప్పుడు? ఏమి? చేయబోతున్నామో సభ్యులకు తెలియజెప్పటమే సంకల్పం అంటే. వివాహంలోని ప్రతి ఘట్టం ప్రారంభంలోను ఈ సంకల్పం చేయబడుతుంది. ఈ సంకల్పంలో దేశము, కాలము మొదలగునవి స్మరించబడును. ఈ సంకల్పంలో సృష్ట్యాది నుండి ఇప్పటికి ఎన్ని యుగాలు, మన్వంతరాలు గడిచినవో ఏ సంవత్సరం, ఏ తిథి, ఏ వారం, ఏ ప్రదేశంలో ఈ పని జరుగుచున్నదో ఈ సంకల్పం వింటే ఎవరివి అడగకుండానే తెలుస్తుంది. భూగోళము, కాలగమనము, చరిత్రల పరిజ్ఞానం దీనిలో మనకు చక్కగా గోచరిస్తుంది.



**గణపతి పూజ :** ప్రతిపని ప్రారంభించటానికి ముందు ఆ పని నిర్విఘ్నంగా కొనసాగటానికి, ఉపద్రవాలు, విఘ్నాలు రాకుండా వుండటానికి గణపతి పూజ చేస్తారు.

యశ్శివో నామ రూపాభ్యాం యా దేవీ సర్వమంగలా
తయో స్సంస్మరణాత్ పుంసాం సర్వతో జయమంగళం

ఈ శ్లోకం సమస్త దుశ్శకునాలను, విఘ్నాలను పోగొట్టుతుంది.

**పుణ్యాహవాచనం :** పుణ్య + అహ + వాచనం = పుణ్యాహవాచనం. అనగా ఈ రోజు శుభదినం అని పెద్దలచేత పలికించటం. శుద్ధి, వృద్ధి, శాంతి, అభ్యుదయముల కొరకు పుణ్యాహ వాచనం చేస్తారు. మూడు కలశములలో నీరు పోసి వాటిలో మామిడి మండలు, పుష్పాలు, గంధము, అక్షతలు వేసి వాటిలోకి దేవతలను ఆవాహన చేసి, పూజించి ఆ నీటితో అన్నిటిని, తమను శుద్ధి చేసుకొందురు. బ్రాహ్మణ ఆశీర్వాదం పొందుతారు.

**అంకురారోపణ :** ఐదు మూకుళ్ళలో పుట్టమట్టిని నింపి వాటిలో బ్రహ్మ, ఇంద్రుడు, యముడు, వరుణుడు, చంద్రుడు - దేవతలను ఆవాహనచేసి, నవ

ధాన్యాలను అవుపాలతో కడిగి, పాలకులలో నింపి నీళ్ల పోయాలి. ఇవి రోజురోజుకి వృద్ధిచెందినట్లే నవదంపతుల జీవితము వృద్ధి చెందాలని భావన. ప్రేమాంకురములు మొలకెత్తాలని, అవి క్రమంగా వృద్ధి చెందాలని ఆకాంక్ష. బీజము, క్షేత్రము, నీరు వీటి యొక్క భౌతిక ఆధ్యాత్మిక శక్తులను, ఉపయోగములను తెలుసుకోవాలని ఉద్దేశ్యము.

**గౌరీపూజ :** "అష్టవర్షాభవేత్‌గౌరీ" పది సంవత్సరములు గల కన్యను "గౌరి" దేవి ఆశ్రయించి వుంటుంది. గౌరిని పూజించుటవల్ల కన్యను ఆశ్రయించి వున్న దేవి ఇంకా ప్రసన్నురాలై సమస్త శుభాలను కలుగ చేస్తుంది. దీర్ఘ సుమంగళీత్వాన్ని ఇచ్చేది గౌరీ దేవియే. పట్టుదలతో, దీక్షతో, తపస్సు చేసి శంకరుని మెప్పించి ఆయనను భర్తగా పొందినది "గౌరి". ఆమె తపస్సు చేసిన పర్వత శిఖరం పేరు 'గౌరీ శిఖరం'. ఆమె శరీరం రంగు గౌరవర్ణం కావటంచేత ఆమె 'గౌరి' అయింది. గౌరీశంకరులు అర్ధనారీశ్వరులు. ఈ దంపతులు కూడా అలా కలిసి ఒకటిగా వుండాలని ఆకాంక్ష. కన్యగా గౌరీపూజ చేస్తారు. వివాహమైన తరువాత మంగళగౌరిని పూజిస్తారు.

**వరపూజ :** వరుని 'లక్ష్మీనారాయణ' స్వరూపునిగా భావించి పూజ చేస్తారు. కాళ్లు కడిగి నూతన



వస్త్రాలు, గంధ, పుష్పాక్షతలతో పూజించి కల్యాణానికి విచ్చేయమని కన్యాదాత ఆహ్వానిస్తాడు. మేళతాళాలతో వరుని తీసుకువస్తారు. మంగళ స్నానాలు చేయిస్తారు. మంగళస్నానాల వలన వధూవరుల శారీరకస్థితి, అవయవ లోపాలు, చర్మవ్యాధులు, మొదలగునవి పరిశీలించు అవకాశం లభించును.

**గోత్రప్రవరలు :** గోత్రమంటే వంశం. ప్రవర అంటే వంశమూల పురుషుల కూటం. వరుడు కన్యాన్వేషణకు పంపిన పెద్దలు కన్యాదాతకు వరుని యొక్క మూడు తరాల వంశవృక్షాన్ని వివరించి చెపుతారు. అట్లే వరాన్వేషణకు బయలుదేరినవారు పిల్లవాని వద్దకు వచ్చి కన్య యొక్క మూడుతరాల వివరం తెలియజేస్తారు. దీనివల్ల పిల్ల, పిల్లవాని యొక్క వంశములను గురించి తెలుసుకొని వివాహం చేసుకోవాలి అని భావం. ఒకరి యొక్క పూర్వాపరాలు మరియొకరు తెలుసుకోకుండా మోసపోకండి అని సూచన. వంశాన్ని గురించి విచారించకుండా కన్యనిచ్చి, లేక కన్యను తెచ్చుకొని బాధలకు గురి అవుతున్నవారు చాలామంది వున్నారు.

**యజ్ఞోపవీత ధారణ :** ఉపనయన కాలంలో ఒక యజ్ఞోపవీతం ధరింపజేస్తారు. వివాహ సమయంలో

కన్యాదాత వరునకు మరియొక యజ్ఞోపవీతం వేస్తారు.

ఈ మహా సంకల్పం : మామూలు సంకల్పాల కంటె ప్రత్యేకమైనది కావున దీనిని 'మహా సంకల్పం' అన్నారు. ఈ భరతవర్షం, భరత ఖండం, ఎంత ప్రాచీనమైనదో, ఎందరెందరు చక్రవర్తులు పరిపాలించారో, ఎన్నెన్ని నదులు, సముద్రాలు, పర్వతాలు, అరణ్యాలు, దేశాలు వున్నవో వాటన్నిటిని స్పష్టంగా విపులంగా తెలియజేస్తుంది మహాసంకల్పం. మహాసంకల్పం విశ్వ స్వరూపాన్ని, భూగోళస్థితిని, చక్కగా వర్ణిస్తుంది. 50 కోట్ల యోజనాల విస్తీర్ణం గల భూమండలంలో, లక్ష యోజనాల విస్తీర్ణం గల జంబూ ద్వీపంలో, 1000 యోజనాల విస్తీర్ణం గల భరత వర్షంలో, నవ ఖండాలలో ఒకటైన భరత ఖండంలో ఈ కన్యాదానం ఎక్కడ చేస్తున్నది పేర్కొంటారు.

అలాగే ఆద్యబ్రహ్మ యొక్క నూరు సంవత్సరాల కాలంలో మొదటి 50 సం|| గడచిపోగా రెండవ 50సం||ల కాలంలో మొదటి సంవత్సరం మొదటి నెల, మొదటి పక్షం, మొదటి రోజులోని మొదటి పగలులో 2వ జాములోని 3వ ముహూర్తంలో, ప్రథమ ప్రాణాయామకాలంలో, శ్వేతవరాహ కల్పంలో, వైవస్వత మన్వంతరంలో,



శాలివాహన శకంలో, 28వ మహాయుగంలోని కలియుగంలో బౌద్ధావతారంలో చాంద్రమాన భావ సంవత్స వసంతఋతువు, చైత్రమాసం, బహుళపక్షం పంచమి తి ఆదివారం శుభయోగం, శుభకరణం, శుభఘడియలల్ సమస్త పాపముల నివృత్తి కొరకు గంగానదిలోని ఇసు సప్తఋషి మండలం వరకూ పేర్చగా వచ్చిన సంవత్స రములను వేయితో గుణించగా వచ్చిన సంవత్సరముల అయిపోయిన తరువాత ఒక్కొక్క రేణువు తీసివేయుట నికి ఎంతకాలం పడుతుందో అంతకాలం, అట్లే యవల గ్రహమండలం వరకు, నువ్వులు సూర్యమండలం వరకు ఎద్దురోమములు నక్షత్రమండలం వరకు రాసిపోసి వే సంవత్సరములకు ఒక్కొక్కటి చొప్పున మొత్తము తీసివే టానికి పట్టునంతకాలము బ్రహ్మలోకంలో నివసించటానికి అశ్వమేధాది యాగములు ముమ్మారు చేసిన ఫలిత పొందటానికి, నాకు వెనుక, ముందు పది తరాలవార నరకం నుండి ఉద్ధరింపబడి శాశ్వతంగా బ్రహ్మలోకంల్ నివసించుట కొరకు, చక్కగా అలంకరింపబడిన కన్యను బంగారము, నీటితో కూడిన దానిని దానం ఇస్తున్నాన అని అంటాడు కన్యాదాత. ఈ మహా సంకల్పం విశ్వంల్ మానవుడెంత చిన్నవాడో అర్థం చేసుకోవడానికి, అహం

కాలాన్ని తగ్గించుకొని, వినయ విధేయతలతో, కర్తవ్య పరాయణుడై, ధర్మానికి కట్టుబడి జీవించటానికి ఎంతో ఉపకరిస్తుంది. ఇంతేకాదు మన దేశముయొక్క భౌగోళిక స్థితి, మన చరిత్ర, మన పూర్వపు ఔన్నత్యము, మన భౌతిక సంపత్తి మొదలగు వాటి యొక్క సమగ్ర స్వరూపాన్ని మన ముందుంచుతుంది. మన చరిత్ర మరుగునపడిపోయింది. దానిని వెలుగులోకి తేవాలి.

మహా సంకల్పంలోని కొన్ని వివరాలు :

*సప్త ఊర్ధ్వ లోకాలు:* భూర్లోక, భువర్లోక, సువర్లోక, మహర్లోక, జనోలోక, తపోలోక, సత్యలోకాలు.

*సప్త అధోలోకాలు:* అతల, వితల, సుతల, తలాతల, రసాతల, మహాతల, పాతాళ లోకాలు.

*అష్టదిగ్గజాలు:* ఐరావత, పుండరీక, వామన, కుముద, అంజన, పుష్పదంత, సార్వభౌమ, సుప్రతీక అనేవి.

*అష్ట పుణ్య పురములు:* అమరావతి, అశోకవతి, అంభోవతి, రైవతి, సిద్ధవతి, సాధ్యవతి, గాంధర్వవతి, అలకావతి.

*అష్టదిక్పాలకులు:* ఇంద్ర, అగ్ని, యమ, నిరృతి, వరుణ, వాయు, కుబేర, ఈశాన.

*పంచ మహా పర్వతాలు:* మతంగ, హిరణ్య శృంగ,



మాల్యవంత, కిష్కింధ, ఋష్యశృంగ.

*సప్త కుల పర్వతాలు:* మహేంద్ర, మలయ, సహ్యశక్తి, హిమవంతము, ఋక్షవంతము, వింధ్య, పారియాత్రము.

*సప్త పుణ్యక్షేత్రములు:* అయోధ్య, మధుర, మాయ, కాశీ, కాంచి, అవంతికా, ద్వారవతీ.

*సప్తసముద్రాలు:* లవణ (ఉప్పు), ఇక్షు (చెరకు), సురా (కల్లు), సర్పి (నెయ్యి), దధి (పెరుగు), క్షీర (పాలు), నీరు.

*సప్తద్వీపాలు:* జంబూ, ప్లక్ష, కుశ, క్రౌంచ, శాక. శాల్మల, పుష్కర.

*నవవర్షాలు (ప్రదేశాలు):* ఇంద్ర, కశేరు, తామ్ర. గభస్తి, నాగ, సౌమ్య, గాంధర్వ, చారణ, భారత.

*నవఖండాలు:* భారత, కింపురుష, ఇలావృత, కురు. భద్రాశ్వక, రమణక, హిరణ్యక, కేతుమాల, హరి.

*దశఅరణ్యాలు:* దండక, వింధ్యక, చంపక, బదరిక. నహుష, నైమిశ, ద్వైత, గుహ, దేవదారు, శ్వేత.

*ప్రసిద్ధనదులు:* భాగీరథీ, గౌతమీ, నర్మదా, యమునా సరస్వతీ, కృష్ణవేణీ, బాహుదా, భీమరథీ, తుంగభద్రా, రేణుకా, మలాపహారీ, కావేరీ, కృతమాలా, తామ్రపర్ణీ, విశోకా, కౌశికీ, గండకీ, విచిత్రకా, వశిష్ఠా, కాశ్యపీ,

సరయూ, సర్వపాపహా, కుశావతి, ఫల్గునీ, ప్రణీతా మొద లగునవి.

*64 దేశాలు:* అంగ, వంగ, కళింగ, కాశ్మీర, సౌరాష్ట్ర, మహారాష్ట్ర, మగధ, మాలవ, నేపాల, కేరళ, చోళ, పాంచాల, సింహళ, ద్రవిడ, కర్నాటక, ఆంధ్ర మొదలగునవి 64.

*నవకల్పములు:* పార్థివ, అనంత, కూర్మ, బ్రహ్మ, వరాహ, శ్వేతవరాహ, ప్రళయ, పద్మ, సావిత్రీ కల్పములు.

*చతుర్దశమనువులు:* స్వాయంభువ, స్వారోచిష, ఉత్తమ, తామస, రైవత, చాక్షుష, వైవస్వత, సూర్య, అగ్ని, బ్రహ్మ, రుద్ర, దక్ష, రౌచ్య, భౌచ్య.

*షట్ శకములు:* యుధిష్ఠిర, విక్రమార్క, శాలివా హన, విజయాభినందన, నాగార్జున, కలి.

*షట్ చక్రవర్తులు:* కార్తవీర్య, నగర, పురూరవ, పురుకుత్స, నల, హరిశ్చంద్ర.

*షోడశ మహారాజులు:* రామ, శిబి, రంతి, గయ, నృగు, పృథు, మాంధాతృ, యయాతి, మరుత్, దిలీప, సుహోత, భరత, అంబరీష, శశిబిందు, భగీరథ, పరశు రామ.



*భూమండల విస్తీర్ణం:* 50 కోట్ల యోజనాలు
50×8=400 కోట్ల చ|| మైళ్లు

*జంబూద్వీప విస్తీర్ణం:*
1 లక్ష యోజనములు = 8 లక్షల చ|| మైళ్లు

*భరతవర్ష విస్తీర్ణం:*
9 వేల యోజనములు 9×8= 72 వేల చ|| మైళ్లు

*కృతయుగ పరిమాణం:* 17,28,000 సంవత్సరాలు

*త్రేతాయుగ పరిమాణం:* 12,96,000 సంవత్సరాలు

*ద్వాపరయుగ పరిమాణం:* 8,64,000 సంవత్సరాలు

*కలియుగ పరిమాణం:* 4,32,000 సంవత్సరాలు

మంగళాష్టకాలు : నూతన వధూవరులకు శుభం కలగాలని చదివే శ్లోకాలను మంగళాష్టకాలంటారు. 8 శ్లోకాలతో శ్రీ లక్ష్మీనారాయణులను, బ్రహ్మ, ఇంద్ర, సూర్య, చంద్ర, వరుణ మొదలగు దేవతలను, విశ్వా మిత్ర, పరాశర, భృగు, వసిష్ఠాది ఋషులను, మాంధాత, నహుష, ఇక్ష్వాకు మొదలగు రాజులను, అశ్వత్థ, బదరీ, కల్పవృక్షాది వనాలను, రాశులు, గ్రహాలను, గౌరీ, లక్ష్మీ,

సరస్వతి మొదలగు స్త్రీదేవతలను, గంగ, సింధు, యమున మొదలగు నదులను, వధూవరులకు మంగళమును కలిగింతురుగాక! అని ప్రార్థిస్తారు.

కన్యాదానం : వరుని లక్ష్మీనారాయణ స్వరూపంగా భావించి, కాళ్లుగడిగి, కన్యాదానం చేస్తారు. ముందు కుడికాలు, తరువాత ఎడమకాలు, ఆ తరువాత రెండు పాదాలను కడగాలి. గంధ పుష్పాదులతో పూజించి, మధుపర్కం ఇవ్వాలి. మధుపర్కం అంటే తేనె+పెరుగు లేక పెరుగు+నెయ్యి కలిపిన మధుర పదార్థము. తరువాత కన్యాదానం చేయాలి. వరుని విష్ణుస్వరూపునిగా భావిస్తున్నాం కనుకనే పెద్దవాడైనా మామగారు అల్లుని కాళ్లుగడిగి ఆ నీరు నెత్తిన చల్లుకుంటాడు. కన్యాదానం చేసేటప్పుడు ఈ శ్లోకాలు చదువుతారు.

కన్యాం కనక సంపన్నాం కనకాభరణై ర్యుతాం |
దాస్యామి విష్ణవే తుభ్యం బ్రహ్మలోక జిగీషయా ||

బ్రహ్మలోక ప్రాప్తికోసం నేను సువర్ణ సంపద గలదియు, బంగారు ఆభరణములచే అలంకరింపబడిన కన్యను విష్ణు స్వరూపుడగు నీకు ఇచ్చుచున్నాను.

విశ్వంభర స్సర్వభూతాః సాక్షిణ్య స్సర్వదేవతాః |
కన్యామిమాం ప్రదాస్యామి పితౄణాం తారణాయవై ||



భగవంతుడు, పంచభూతములు, సర్వదేవతలు సాక్షిగా నా పితృ దేవతలు తరించటానికి ఈ కన్యను దానం చేస్తున్నాను.

కన్యాం సాలంకృతాం సాధ్వీం సుశీలాయ సుధీమతే|
ప్రయతోఽహం ప్రయచ్ఛామి ధర్మకామార్థ సిద్ధయే||

సర్వాలంకార శోభిత, సాధ్వి, సుశీల అయిన ఈ కన్యను ధర్మ, అర్థ, కామాలనే పురుషార్థాల సిద్ధికొరకు సుశీలుడు, బుద్ధిమంతుడు అగువానికి దానం చేయుచున్నాను.

వధూవరుల గోత్రప్రవరలు మరియొకసారి చెప్పి "తుభ్యః ప్రజా సహత్వ కర్మభ్యః ప్రతిపాదయామి" సత్సంతానము పొందుటకు ధర్మ కర్మలను ఆచరించుటకు నీకు నియమించుచున్నాను. కావున ఈమెను "వృణీధ్వం" వరించవలసినది అని కన్యాదాత అంటాడు. "వృణీమహే" వరించుచున్నాను అని వరుడు పలుకును.

"పయోదాత్రే, మయోమహ్యమస్తు ప్రతిగ్రహీత్రే"

కన్యనిచ్చిన దాతకు, స్వీకరించిన నాకు బాంధవ్యము కలుగుగాక! అంటాడు వరుడు. ఈ దానం సఫలం కావటం కొరకు దక్షిణ ఇస్తారు. తరువాత సాలగ్రామ

దానం చేస్తాడు కన్యాదాత.

మిగతా వస్తువులు దానం చేసేటప్పుడు "తుభ్యమహం సంప్రదదే నమమ" నీకు నేను యిచ్చుచున్నాను. ఇక నుండి ఇది నాదికాదు. అని అంటారు. కాని కన్యాదానం చేసినప్పుడు మాత్రము "నమమ", "ఇది నాదికాదు" అని అనరు.

కన్యాదానానికి ముందు కన్యను ధాన్యపు గంపలో కూర్చోబెట్టి తీసుకురావటం ఆచారం. కన్యను ధాన్యలక్ష్మిగా భావించి ఆమెను నీకు సమర్పిస్తున్నానని భావము.

దానమిచ్చే వస్తువును ఒక పాత్రలో వుంచి దానము చేయాలి. అట్లే కన్యను కూడా ఒక పాత్రలో వుంచి దానము చేయాలి. కన్యను వెదురు బుట్టలో వుంచి దానము చేయుట శాస్త్రాచారము. పూర్వము చిన్నపిల్లలకు వివాహం జరిపేవారు గనుక గంపలో కూర్చో బెట్టి దానం చేసేవారుట.

నాతిచరామి : "ధర్మార్థ కామేషు త్వయైషా నాతి చరితవ్యా" "నాతిచరామి"

"ధర్మ, అర్థ, కామముల విషయంలో ఈమెను (వధువును) అతిక్రమించి ప్రవర్తించకు" అని కన్యాదాత అంటే



"అతిక్రమించను" అని వరుడు ప్రమాణం చేస్తాడు. అనగా ధర్మం చేసే విషయంలో, అర్థం (డబ్బు) సంపాదించటంలో అలాగే కామం విషయంలో నేను నా భార్యను అతిక్రమించి ప్రవర్తించను అని ప్రమాణం చేయుటం. స్త్రీ పతివ్రతగా వుండాలని భావించే పురుషులందరు తాము ఏక పత్నీవ్రతులుగా వుండాలని భావం.

తెరసెల్లా : వరుడు వధువు సుముహూర్తమునకు ముందుగా ఒకరినొకరు చూడకుండుటకై వారిద్దరి మధ్య ఏర్పాటుచేసిన తెరను తెరసెల్లా అంటారు. దీనిలోని విశేషభావం ఈ విధంగా అన్వయించుకోవచ్చు. వరుడు పరమాత్మ. వధువు జీవాత్మ. మధ్యనుండే తెరసెల్లా మాయ. జీవాత్మకి, పరమాత్మ దర్శనం కావాలంటే మధ్య నుండే మాయ అనే తెర తొలగాలిట. పరమాత్మను దర్శించటానికి ఆయన పాదాలు పట్టుకోవాలిట. అందుకే వరుని పాదాలు కడిగి కన్యాదానం చేస్తాడు. సుముహూర్త సమయంలో ఆ తెర తొలగిస్తారు. ఒకరినొకరు దర్శిస్తారు.

సుముహూర్తం : వధువు తూర్పుముఖంగాను, వరుడు పశ్చిమ ముఖంగాను కూర్చుంటారు. మధ్య తెర వుంటుంది. వేద ఘోష, మంగళ వాద్యముల మధ్య

తెర తొలగించబడుతుంది. వధూవరులు ఒకరినొకరు భ్రూమధ్యంలో చూస్తారు. ఇదే సుముహూర్తం. మొదటి సారిగా ఒకరినొకరు చూచుకొనుటయే సుముహూర్తం. ఈ సమయంలో జీలకఱ్ఱ, బెల్లం, బాగా కలిపి నూరి ముద్దచేసి దానిని ఒకరి నడినెత్తిన (బ్రహ్మరంధ్రంపై) మరియొకరు వుంచుతారు. అప్పుడు ఈ మంత్రములు పఠిస్తారు.

"ధ్రువంతే రాజా వరుణో ధ్రువం దేవో బృహస్పతిః
ధ్రువంత ఇంద్రశ్చాగ్నిశ్చ రాష్ట్రం ధారయతాం ధ్రువం"

ఈ దాంపత్య సామ్రాజ్యమును ధరించునట్టి మీకు రాజగు వరుణదేవుడు, దేవుడగు బృహస్పతి, ఇంద్రుడు, అగ్ని స్థిరత్వమును కలుగజేయునుగాక.

అభ్రాతృఘ్నీం వరుణాపతిఘ్నీం బృహస్పతే
ఇంద్రా పుత్రఘ్నీం లక్ష్మ్యం తామస్యై సవిత స్సువ

ఓ వరుణ దేవా! సవిత వల్ల యీమెకు కలిగిన లక్ష్మి ఈమె సోదరులకు అభివృద్ధిని కలిగించు గాక! బృహస్పతీ! నీ దయవల్ల ఈమె భర్తకు అభివృద్ధిని కలిగించేది కావాలి. ఇంద్రా! ఈమె పుత్ర సంతానం పొందేదిగా అనుగ్రహించు.

"అఘోర చక్షుర పతిఘ్న్యేధి శివా పతిభ్య స్సుమనా స్సువర్చాః



జీవసూర్దేవ కామా స్యోనాశన్నో భవ ద్విపదే శం చతుష్పదే"

శుభ దృష్టి కల దానివిగాను, సౌభాగ్యవతిగాను, వర్ధిల్లుము, మంచి మనస్సుతో, తేజస్సుతో వర్ధిల్లుము. వీరులైన పుత్రులను కనుము. దేవతలు మెచ్చునట్లు ప్రవర్తించుము. మనకు, మన బంధువులకు, పశువులకు శాంతి కలగాలి.

తరువాత వధువు కనుబొమ్మల మధ్య దర్భకొసలతో మూడుసార్లు పైకి తుడుస్తూ నీలోగల అవలక్షణాలన్ని పోవాలని నిర్దేశిస్తున్నానంటాడు వరుడు. భర్తృగండం దృష్టి దోషం తొలగాలని భావం.

జీలకఱ్ఱ-బెల్లం : పదార్థ విజ్ఞాన శాస్త్రవేత్తలు జీలకఱ్ఱ, బెల్లం, కలిపి నూరిన ధన సంజ్ఞకమగు విద్యుత్తు (positive electric charge) కలుగుతుందని వర్ణించారు. గాజుకడ్డీని పట్టుతో ఘర్షణ చేసినచో ధన సంజ్ఞక విద్యుత్తు వుత్పన్నమై వస్తువులను ఆకర్షించు శక్తి కలుగును. జీలకర్రను బెల్లంతో ఘర్షణ చేసిన అట్లే జరుగును. దీనివలన వధూవరుల పరస్పర జీవశక్తులు ఆకర్షింపబడును.

బ్రహ్మ రంధ్రం మామూలుగా మూసుకొని వుంటుంది. జీలకర్ర బెల్లం యొక్క మిశ్రమాన్ని బ్రహ్మరంధ్రంపై వుంచుటవలన అది తెరచుకొనును. వధూవరులు ఒకరి

తలపై మరియొకరు ఉంచిన చేతులద్వారా వారి శక్తి జీలకర్ర బెల్లము యొక్క మిశ్రమం ద్వారా బ్రహ్మరంధ్రం లోకి ప్రవేశించి ఆ క్రిందుగా వున్న సహస్రార చక్రం ద్వారా భ్రూమధ్యంలో వున్న ఆజ్ఞాచక్రం ద్వారా వెలువడి ఒకరినొకరు ఆకర్షించుకొందురు. పరస్పరము ఒకరి నొకరు భ్రూమధ్యంలో చూడటం వల్ల ఒకరి ఆజ్ఞా సహస్రార చక్రాలు ఇంకొకరి ఆజ్ఞా సహస్రార చక్రాలలో లీన మౌతాయి. ఒకరితో ఒకరు కలిసి పోతారు. ఒకరికొకరు వశులౌతారు. హస్తమస్తక సంయోగం జరుగుతుంది.

**కాడి రంధ్రం గుండా నీరు వదలుట :** ఉత్తర దక్షిణాలుగా కాడిని పట్టుకొని దక్షిణమున నున్న రంధ్రము నందు దర్భతో బంగారము వుంచి దానిమీదుగా జలమును వరుడు వధువు పాపటమీద విడుచును. దీనివల్ల వధువు పవిత్రురాలగును. దోషములు పోయి వర్చస్సు కలుగును. ఇక్కడ చదువబడే మంత్రాలు కొన్ని......

"ఇద మహం యా త్వయి పతిఘ్ని అలక్ష్మీస్తాం నిర్దిశామి ......
అవీరఘ్నీరుదపం త్వావః......
ఖేనమః శేరథః ఖే యుగస్య శచీపతే.
అపాలా మింద్రత్రిః పూర్వ్యాకర త్సూర్య వర్చసమ్..

వీరులైన సంతతికి అరిష్టము కలుగకుండా ఈ జల



ములు క్షాళనము చేయుగాక! గగనమున రథమును నడువు ఓ శచీపతీ! అపాల (అంతకుముందు ఎవరిపాలనలో లేనిది) అయిన ఈమెను సూర్యుని తేజస్సు గల దానిగా ముమ్మారు చేయుగాక!

'శన్తే హిరణ్యగ్ం సముశన్త్వాపః, శన్తే మేధీ భవతు శంయుగస్య తృద్మ, శన్త అప శ్శతపవిత్రా భవన్త్వథా పత్యా తన్వగ్ం సగ్ంసృజస్వ'

బంగారువెలుగులు మెల్లగా జలములందు ప్రవేశించు గాక! మెల్లగా జలములు సారవంతములగు గాక! ఈ కాడి యొక్క దారి శాంతిని కలిగించు గాక! ఈ జలములు శాంతిని కలిగించి నూరు రెట్లుగా ఈ వధువును పవిత్రము చేయుగాక! ఇటువైన భర్తతో వర్ధిల్లునట్లు ఈ జలములు కల్పించుగాక!

**అపాల కథ :** అపాల అనే కన్యకు శ్వేత కుష్ఠ (తెల్లబొల్లి) వుండటం చేత ఆమెను ఎవ్వరూ పెండ్లి చేసుకోలేదు. ఆమెకు భర్తతో కూడి యజ్ఞం చేసి ఇంద్రునకు సోమరసం ఇవ్వాలని కోరిక. తన కోరిక నెరవేరక ఒకరోజున ఆత్మహత్య చేసుకొనుటకు నదికి వెళ్ళింది. నదిలో సోమలత కొట్టుకొనివస్తోంది. ఆమె ఆ సోమలతలను పట్టుకొని నమిలి ఆ రసాన్ని ఇంద్రునకు

అర్పించింది. ఇంద్రుడు సంతోషించి తన రథపు కాడి రంధ్రం గుండా ఆమె మీద పడేటట్లు నీరు చల్లాడు, దానితో ఆమె బొల్లి పోయి, సూర్యవర్చస్సు గల ఆకర్ష ణీయురాలైంది. అపాలవలెనే ఈ కన్య కూడా తేజస్సు గలదిగా కావాలని ప్రార్థన. కాడి రంధ్రం నుండి విడిచే నీరు సోమరసంగా భావించాలి. దీనివల్ల యజ్ఞం చేసిన ఫలితం కన్యకు లభిస్తుంది.

**యోక్త్రధారణ :** యోక్త్ర మంటే దర్భలతో పేనిన త్రాడు. వరుడు ఈ త్రాడును వధువు నడుముకు చుట్టి ముడివేస్తాడు. ఇది ఒకరకంగా నడుము బిగించటం, అంటే దీక్షతీసుకోవటం.

*ఆశాసానా సౌమనసం ప్రజాగ్ం సౌభాగ్యం తనూం*
*అగ్నే రనువ్రతా భూత్వా సన్నహ్యే సుకృతాయకమ్*

మంచి మనస్సును, మంచి సంతతిని, సౌభాగ్యాన్ని, మంచి శరీరమునూ, కలిగియుండి అగ్నిహోత్రమున నాకు సహధర్మచారిణివై సత్కార్యములకు సిద్ధముకమ్ము. ఈ జీవిత యజ్ఞమనే పనికి నడుము కట్టుము.

ఆడ పిల్లలకు కూడా మగవారి వలె ఉపనయన సంస్కార ముండేదట. గౌరీపూజ, నడుముకు దర్భ త్రాడు కట్టటం ఆ ఉపనయనంలో భాగాలట. స్త్రీలకు



యజ్ఞోపవీతం కూడా వుండేదట. అదే మంగళ సూత్రం అయిందట. స్త్రీ మెడలోనిది మంగళసూత్రం అయితే, మొలత్రాడును 'కటిసూత్రం' యజ్ఞోపవీతాన్ని 'బ్రహ్మ సూత్రం' అని అంటారు. ఈ యోక్త్రధారణను పత్నీ వ్రతోపనయనం అంటారు.

మంగళసూత్ర ధారణ : సూత్రం అంటే దారం లేక త్రాడు. మంగళప్రదమైన సూత్రం గనుక మంగ ళసూత్రం అన్నారు. మంగళసూత్రాలను పూజించి, పెద్దలు, ముత్తైదువులకు తాకించి అనగా వారందరి ఆశీ స్సులు పొంది వధువు మెడలో ఆ సూత్రాలను వరుడు ఈ క్రింది శ్లోకం చదువుతూ మూడుముళ్ళు వేస్తాడు.

*"మాంగల్య తంతునానేన మమ జీవన హేతునా,*
*కంఠే బధ్నామి సుభగే సా జీవ శరదాం శతమ్"*

ఓ వధువా! నా జీవితానికి కారణమైన ఈ సూత్రంతో నేను నీ మెడలో మాంగల్యమును కట్టుచు న్నాను. నా జీవితానికి ఆధారమైన మంగళసూత్రాన్ని ధరించి నీవు నూరేండ్లు జీవించుము. ఇక్కడ నూరు అనునది అనంత సంఖ్యను తెలుపును. వివాహ బంధానికి చిహ్నం ఈ మంగళ సూత్రం. మంగళ సూత్రానికి రెండు బంగారు బిళ్లలు వుంటాయి. అవి హృదయస్థా

నంలో వ్రేలాడుతూ వుంటాయి. జీవాత్మ, పరమాత్మలని రెండు వుంటాయని, అవి హృదయస్థానంలోనే వుంటాయని చెప్పటానికి సంకేతం అంటారు. మంగళసూత్రం యొక్క శక్తి అమోఘం.

మంగళసూత్రం కట్టునప్పుడు మూడుముళ్లు వేయిస్తారు. ప్రతి వ్యక్తికీ స్థూల, సూక్ష్మ, కారణ శరీరాలు మూడు వుంటాయి. ఈ మూడు శరీరాలకు మూడు ముళ్లు వేస్తాడు వరుడు. స్థూల శరీరం పోయినా, మిగిలిన రెండు శరీరాలకు కూడా ముడివేశాడు కాబట్టి, భర్త స్థూలశరీరం పోయిన తరువాత కూడా అతడే భర్త అగును.

**తలంబ్రాలు :** తలయందు పోయుబడే బియ్యం గనుక వాటిని తలంబ్రాలు అంటారు. పసుపుతో కలిపిన అక్షతలను వధూవరులు ఒకరి తలపై మరియొకరు పోసుకోవటాన్ని తలంబ్రాలు పోసుకోవటం లేక అక్షతారోపణం అంటారు. ఓ వధువా! నీవు మాయింటికి వచ్చిన తరువాత మన యింట్లో ధాన్యం ఇలా విరివిగా వుంటూ మనం సంపదలతో తుల తూగుతూ వుండాలి, అనే భావానికి ప్రతీకంగా యీ తలంబ్రాలు పోసుకుంటారు.

తలంబ్రాలు వివాహంలో ఒక ప్రధానఘట్టం. దీనిలో



హైందవ జీవన సరళిలో ఆర్థిక దృష్టి ఏమిటో, మన కోరికలకు, మన కున్న వనరులకు సంబంధం ఎలా వుండాలో, వున్న వనరులను ఏవిధంగా వినియోగించుకోవాలో ప్రబోధించే సందేశముంది.

ముందుగా వరుడు పాలతో వధువు చేతులను తుడుస్తాడు. ఆమెదోసిట్లో ఎండుకొబ్బరిచిప్పతో రెండుసార్లు అక్షతలను పోసి, వాటిని నేతితో రెండుసార్లు ప్రోక్షిస్తాడు. తరువాత పురోహితుడు అదేవిధంగా అక్షతలను వరునిచేతిలో పోసి వధువు దోసిలిపై వరుని దోసిలి వుంచి ఈ మంత్రాలు చదువుతాడు.

"కపిలాస్సన్స్మారయంతు. బహుదేయంచాస్తు. పుణ్యం వర్ధతామ్. శాంతిరస్తు. పుష్టిరస్తు. తుష్టిరస్తు. వృద్ధిరస్తు. అవిఘ్నమస్తు. ఆయుష్యమస్తు. ఆరోగ్యమస్తు. స్వస్తి శివంకర్మాస్తు. కర్మసమృద్ధిరస్తు. దంపత్యోః సగ్రహే సనక్షత్రే సహ సోమేన క్రియేతాం. శాంతిరస్తు"

"ప్రజాపతిస్త్రియాం యశః ..... యశో యజ్ఞస్యదక్షిణాం"

కపిల ఆవులను స్మరించండి. అనేక దానాలను చేయండి. పుణ్యం వృద్ధి పొందాలి. శాంతి, పుష్టి, తుష్టి, వృద్ధి కలగాలి. విఘ్నాలు తొలగాలి. ఆయుష్యం, ఆరోగ్యం,

కలగాలి. క్షేమం, శుభం కలగాలి. సత్కార్మలు వృద్ధి పొందాలి. గ్రహాలవల్ల, నక్షత్రాలవల్ల, చంద్రునివల్ల మన దాంపత్యం సరిగా జరగాలి. శాంతి కలగాలి.

"ప్రజామే కామ స్సమృధ్యతాం" నేను కోరిన సంతానం సమృద్ధిగా కలుగుగాక! అని వరుడు వధువు శిరస్సుపై మొదటిసారిగా తలంబ్రాలు పోస్తాడు. వధువు తన దోసిలి లోని తలంబ్రాలు వరుని శిరస్సుపై పోస్తుంది. రెండవసారి వెనుకటి లాగానే చేతులలో తలంబ్రాలు నింపుకొని వరుని దోసిలిపై వధువు దోసిలి వుంచి వెనుకటి మంత్రాలు చదివి చివరిలో

"పశవోమే కామస్సమృధ్యతాం"

నాకిష్టమైన పాడిపంటలు సమృద్ధిగా వుండుగాక! అని వధువు వరుని శిరస్సుపై తలంబ్రాలు పోస్తుంది. మూడ వసారికూడా పైన చెప్పిన విధంగానే చేసి వరుని దోసిలిని వధువు దోసిలిపై వుంచి చివరకు

"యజ్ఞోమే కామ స్సమృధ్యతాం"

నాకిష్టమైన త్యాగం సమృద్ధిగా వుండాలి అని వరుడు వధువు శిరస్సుపై పోయును. నాల్గవసారి వధువు



"శ్రియోమే కామ స్సమృధ్యతాం"

మాకు కావలసిన సిరిసంపదలు సమృద్ధిగా వుండాలి. అని వరుని శిరస్సుపై పోస్తుంది. తరువాత మంత్రం లేకుండా తలంబ్రాలు పోసుకుంటారు. ఈ సందర్భంలో "ఆనంద మానంద మాయెనే" అనే సీతారాముల పెళ్ళిపాట పాడతారు వాద్యకారులు. అందరూ ఆనంద పరవశులౌతారు.

రక్షా బంధనం : భౌతికమైన ఉపద్రవాల నుండి రక్షణకోసం, పురుడు, మైల మొదలగునవి సోకకుండా వుండటం కోసం, కార్యనిర్వహణ దీక్షకోసం, వధూవరు లకు కంకణాలు కడతారు. వరునికి కుడిచేతికి, వధువుకు ఎడమచేతికి కంకణం కట్టాలి.

బ్రహ్మముడి : వధువు చీర అంచును, వరుని ఉత్తరీయం యొక్క చివరను కలిపి ముడివేయటాన్ని బ్రహ్మముడి అంటారు. దీనినే కొంగుముడి, బ్రహ్మగ్రంధి అంటారు. ఈ మంత్రం చదువుతారు.

"ధ్రువన్తే రాజా ..... రాష్ట్రం ధారయతాంధ్రువం"

దాంపత్య సామ్రాజ్యాన్ని అనుభవించే మీకు రాజైన వరుణుడు, దేవుడు బృహస్పతి, ఇంద్రుడు, అగ్ని, నిశ్చల

త్వాన్ని కలుగజేయాలని అర్థం. వీరిరువురి బంధం శాశ్వతంగా, స్థిరంగా వుండాలని భావం.

తరువాత వరుడు తన కుడిచేతితో వధువు కుడి చేతిని పట్టుకొని అగ్నిహోత్రుని వద్దకు తీసుకొని వచ్చి నమస్కరించి ఈ మంత్రం చదువుతాడు.

"పూషాత్వేతో నయతు ........ విదథమావదాసి"

నిన్ను పూష ఇలా వెంటతీసుకొని వెళ్లాలి. అశ్వినీ దేవతలు నీ చేయి పట్టుకొని రథంపైన తీసుకొనిరావాలి. ఇంటి యజమానురాలుగా సర్వమునకు పెత్తనం వహించి తీర్చిదిద్దటానికి నా యింటికి రమ్ము.

ప్రధాన హోమం : నూతన దంపతులు మొట్ట మొదట చేసే హోమమే ప్రధాన హోమం.

"సోమః ప్రథమో వివిదే ........ మహ్యమథో ఇమామ్," వరుడు అంటాడు ఓ భార్యా! మొదట సోముడు, తరువాత గంధర్వుడు, ఆపైన అగ్ని నిన్ను ఏలారు. ఇక మానవుడైన నేను నిన్ను పొందుతున్నాను. ఈ కన్య పుట్టగానే సోముడు గంధర్వునికి, గంధర్వుడు అగ్నికి ఇచ్చాడు. అగ్ని నిన్ను నాకు ధన పుత్రసమేతంగా దానం చేస్తున్నాడు. కన్యపుట్టగానే ఆమె



పోషణ బాధ్యత (సోముడు) చంద్రునిది. $2\frac{1}{2}$ సం॥ల కాలం తరువాత చంద్రుడు ఆమె బాధ్యత గంధర్వునికి వప్పగిస్తాడు. $2\frac{1}{2}$ సం॥ల తరువాత గంధర్వుడు అగ్నికి వప్పగిస్తాడు. అగ్ని $2\frac{1}{2}$ సం॥ల తరువాత వరునకు వప్పగిస్తాడు. అంటే చంద్రుడు ఆ కన్యలో ఆకర్షణీయతను, గంధర్వుడు లావణ్యాన్ని, అగ్ని కామగుణాన్ని వరుసగా ప్రవేశపెడతారు. అప్పటికి ఆమెకు 8 సం॥ల వయస్సు వస్తుంది. అప్పుడు ఆమె వివాహం చేసుకోటానికి యోగ్యురాలౌతుంది. అప్పుడు అగ్ని, వాయు, చంద్ర, ఆదిత్య వరుణులను పిలిచి ఇక ఆమెను వరునికిచ్చివదలచుకున్నాను. అంటాడు. "దదామీ త్యగ్నిర్వదతి తథేతి వాయురాహతత్" సరేనంటాడు వాయువు. అట్లే చంద్ర, ఆదిత్య వరుణులు తమ అంగీకారాన్ని తెలుపుతారు. చంద్రుడు సాక్షిగా గంధర్వుడు, గంధర్వుడు సాక్షిగా అగ్ని కన్యను గ్రహిస్తే, అగ్ని సాక్షిగా ఆమెను వరుడు గ్రహిస్తాడు. అందుచేతనే అగ్నిసాక్షిగా పెండ్లి చేసుకోవటం అంటారు. వధువును రథంమీదనే ఇంటికి తీసుకువెళ్ళాలి. దీనినే ఊరేగింపు లేక ఊరెరిగింపు అంటారు. ఊరేగింపు అంటే ఊరిలోనికి ఏగింపు = తీసుకొనిపోయి పరిచయం చేయుట.

పాణిగ్రహణం : అనగా చేయిపట్టుకొనుట లేక పెట్ట

పట్టుట. ముహూర్తమంటే పాణిగ్రహణమేనని కొందరి అభిప్రాయము. ఒకరినొకరు చూచుకున్నప్పుడే ఒకరి చేతిని మరియొకరు పట్టుకోవాలి అని అంటారు. రామాయణంలో జనకుడు అంటాడు. ఇయం సీతామమసుతా ....... పాణిం గృహ్ణీష్వ పాణినా" ఈ సీత నా కూతురు. ఈమె చేతిని నీ చేత్తో పట్టుకో.

పురుషుని కుడిచేయి బోర్లించి స్త్రీ కుడిచేయిపైకి వుండునట్లు చేయి పట్టుకోవాలి. దీనిలో ఒక విశేషముంది. స్త్రీ సంతానం కావాలంటే బొటనవ్రేలు విడిచి మిగిలిన నాలుగువ్రేళ్లు కలిపి చేతితో పట్టుకోవాలి. మగపిల్లవాడు కావాలంటే బొటనవ్రేలిని మాత్రమే ముందుగా పట్టుకోవాలి. ఇద్దరూ కావాలంటే బొటనవ్రేలు, మిగిలిన వ్రేళ్లు కలిపి పట్టుకోవాలి. పాణిగ్రహణం వలన వధూవరులిద్దరిలో ప్రవహించే విద్యుత్ ప్రవాహం కలుస్తుంది. ఇద్దరి మనోప్రాణాలు ఒకటౌతాయి. ఈ మంత్రం చదువుతూ చేయిపట్టుకుంటాడు వరుడు.

"గృభ్ణామితే సుప్రజాస్త్వాయ హస్తం మయా పత్యా జరదష్టి ర్యథాసః | భగో అర్యమా సవితా పురంధిర్మహ్యం త్వా౽ దుర్గార్హపత్యాయ దేవాః|



ఓ వధువా! నేను నీ చేతిని మంచి సంతానం కోసం పట్టుకుంటున్నాను. నీవూ నేనూ కలిసి ఇక రాబోయే సంవత్సరాలన్నీ జీవించాలి. ముసలితనాన్ని కూడా నీతోనే గడుపుతాను. భగ, అర్యమ దేవతలు, ఇంద్రుడు గృహస్థాశ్రమ ధర్మాలను నిర్వహించమని నిన్ను నాకు యిచ్చారు. ఆ దేవతల అనుగ్రహంతో నీవు లభించావు నాకు.

మగపిల్లలు కలిగే అవకాశం వుంటే ఆడపిల్లలను కోరుకునే వారుంటారా అని సందేహం. మగపిల్లలకంటే ఆడపిల్లలే ప్రేమగా చూస్తారు అనే మాటేకాక శాస్త్రం కూడా 'దౌహిత్రః కులదీపకః' అంటుంది. దౌహిత్రుడు అంటే కూతురు కొడుకు. పౌత్రుడు అంటే కొడుకు యొక్క కొడుకు. కొడుకు మూడు తరాలను మాత్రమే ఉద్ధరిస్తాడు. కూతురు (కన్యాదానం ద్వారా) 21 తరాలను ఉద్ధరిస్తుంది.

సప్తపది : వరుడు అగ్నిహోత్రునకు ఉత్తరవైపు వధువుచేత తూర్పునకు కుడికాలుతో ఏడడుగులు వేయిస్తాడు.

"ఏకమిషే విష్ణుస్త్వాన్వేతు, ద్వే ఊర్జే విష్ణు స్త్వాన్వేతు, త్రీణి వ్రతాయ విష్ణుస్త్వాన్వేతు, చత్వారి మాయో భవాయ

విష్ణుస్త్వాన్వేతు, పంచపశుభ్యో విష్ణుస్త్వాన్వేతు, షడృతుభ్యో విష్ణుస్త్వాన్వేతు, సప్త సప్తభ్యోహోత్రాభ్యో విష్ణుస్త్వాన్వేతు."

వధువుతో వరుడు - నీవు నా వెంట నడువుము. నీవు వేసే మొదటి అడుగు వల్ల విష్ణుమూర్తి అన్నాన్ని, రెండవ అడుగు వల్ల బలాన్ని, మూడవ అడుగువల్ల మంచి కార్యాలను, నాలుగవ అడుగువల్ల సౌఖ్యాన్ని, అయిదవ అడుగువల్ల పశుసమృద్ధిని, ఆరవ అడుగువల్ల ఋతు సంపదలను, ఏడవ అడుగువల్ల మహర్షుల అనుగ్రహాన్ని (ఏడుగురు హోతలను) నీకు ఇచ్చు గాక! అంటాడు. ఏడడుగులు వెంటవడిస్తే స్నేహబంధం ఏర్పడుతుందని పెద్దలంటారు. "సాప్త పదీనం సఖ్యం" పదమనగా అడుగు, మాట అని రెండర్థాలు. కాన ఏడడుగులు నడచినమా ఏడుమాటలు మాట్లాడినమా స్నేహం ఏర్పడును.

"సఖా సప్తపదా భవ .......... సముచిత్తాన్యాకరం"

నాతో ఏడడుగులు నడచి నాకు మంచి స్నేహితురాలవు కమ్ము. మనమిద్దరం ఏడడుగులు నడిస్తే స్నేహితుల మౌతాం. అప్పుడు నేను నీ స్నేహాన్ని పొందుతాను. నీ స్నేహమ్నుంచి ఎప్పుడు విడిపోను. నీవు నా సఖ్యతనుండి విడిపోకు. మనం కలిసిమెలసి పరస్పర ప్రేమతో, అను



కూల దాంపత్యంతో ప్రకాశిస్తూ, మంచి మనస్సు కలిగి ఒకరినొకరు గౌరవించుకుంటూ, మంచి ఆహారాన్ని ఇద్దరం కలిసి తిందాం. బలాన్ని పొందుతూ కలిసి వుందాం. కలసి ఆలోచించుకుందాం. కలసి నిర్ణయించుకుందాం. కలసి నడుచుకుందాం. బాహ్యేంద్రియాల విషయంలో కూడా కలసి వుండేటట్లు నడచుకుందాం.

"సాత్వమ స్యమూహామ ........ విహసూనృతే |"

వధువు వరునితో ఇలా అంటుంది - నీవు పొరపాటు లేకుండా వుండు. నేను కూడా ఏ పొరపాటు రాకుండా చూచుకుంటాను. నీవు ఆకాశానివి. నేను భూమిని. నీవు శుక్రధాతువు. నేను శుక్రాన్ని ధరిస్తాను. నీవు మనస్సువు. నేను వాక్యాన్ని.

వరుడు వధువుతో అంటాడు - నేను సామవేదాన్ని. నీవు ఋక్కువై నన్ననుసరించు. మంచి ప్రవృత్తి గల దానివై నీవు పుంస్త్వంగల పుత్రులను కనాలి. వారు సత్యము పలికేవారు, మంచిరూపముగలవారై విలసిల్లాలి.

లాజహోమం : లాజలంటే పేలాలు. భర్తకు దీర్ఘాయువు కలగాలని, తాను దీర్ఘ సుమంగళిగా వుండాలని కోరుతూ వధువు ఈ పేలాలు అగ్నిలో హోమం

చేస్తుంది. అగ్నిహోత్రునికి ఉత్తరంగా వధువుచేత కుడి కాలితో గుండ్రాయిని మూడుసార్లు తొక్కిస్తూ వరుడు అంటాడు -

"ఆతిష్ఠేమ మశ్మాన మశ్మే ఉ వత్వం స్థిరాభవ
అభితిష్ఠ పృతన్యత స్సహాస్వ పృతనా యతః"

ఓ సుందరీ! ఈ రాయిని తొక్కు. దీనివలెనే స్థిరంగా వుండు. శత్రువులను బాధించు.

"అర్యమణం నుదేవా .......... మముతస్కరత్"

వరుడు - వెనుక స్త్రీలు అగ్నిదేవుని పూజించి కోరిన భర్తను పొందారు. లోకోపకారియైన ఆ అగ్నిదేవుడు ఈ చిన్నదానికి వివాహమైన తరువాత పుట్టింటిమీద మమకారం తగ్గించి, అత్తింటిమీద విశేష అనురాగంగల దానినిగా చేయుగాక!

ఉభయులు కలిసి మూడుసార్లు అగ్నికి ప్రదక్షిణం చేస్తారు. తరువాత వధువు నడుముకు కట్టిన దర్భత్రాడు మంత్రముతో విప్పివేస్తారు.

ప్రవేశ హోమము : వరుడు వధువుతో తన యింటికి వెళ్ళి గృహప్రవేశము చేసిన తరువాత "ప్రవేశ హోమం" చేయాలి. గృహప్రవేశం చేసిన తరువాత



[illegible] హోమం [illegible] ప్రవేశ[illegible] వేయు. ఇక్కడ నుండి మిగతా వివాహ ప్రక్రియ అంతా వరుని యింటివద్దనే జరుగవలెను. కాని ప్రస్తుతం అట్లా జరగటం లేదు. వధువు యింటినుండి వధువును, అగ్నిహోత్రమును బండిలో తీసుకొని వెళ్లవలెను. దారిలో వనస్పతులు, నాలుగుదారులు కలిసిన ప్రదేశములు, దేవాలయములు, స్మశానములు వచ్చినచోట దిగి హోమములు చేసుకుంటూ యింటికి చేరవలెను. కుడికాలు ముందు లోపలకు పెట్టి ప్రవేశించాలి. వధువును కుడివైపు కూర్చోబెట్టుకొని ఈ హోమాలు చేయాలి.

"మూర్ధానం పత్యురారోహ ప్రజయాచ విరాడ్భవ |
సమ్రాజ్ఞీ శ్వశురేభవ, సమ్రాజ్ఞీ శ్వశ్రువాంభవ, ననాన్దరి
సమ్రాజ్ఞీభవ సమ్రాజ్ఞీ అధిదేవృషు"

పెళ్ళాం అంటే నెత్తిమీది దేవత అని ఇక్కడ నుండి వచ్చినదే అంటారు. నీవు నా నెత్తిమీద కూర్చోవాలి అంటే శరీరంలో శిరస్సుకు ఎంత ప్రాధాన్యత ఉన్నదో అంత ప్రాధాన్యత ఈ కుటుంబంలో నీకున్నది అని అర్థం. నీవు మామయందు, అత్తయందు, ఆడబిడ్డలయందు, బావ, మరుదులయందు సముచిత ప్రేమాభిమానాలతో వుండు. అందరికి అధిపతివిగా (సమ్రాజ్ఞీ) వుండు.

"స్నుషాణాం శ్వశురాణాం ప్రజాయాశ్చ ధనస్యచ"
పతీనాంచదే వ్రాతాంచ నత్రాతానాం విరాడ్భవ"

భర్తయైన నన్ను, బావలను, మరుదులను, మామం శంలోని వారందరను అనేక విధముల పోషించుచూ అంద రికీ తలలో నాల్కవలె మంచిపేరును సంపాదించుము.

"త్వష్టా జాయామజనయత్త్వష్టా స్యైత్వాంపతిం, త్వష్టా సహ్రస మాయూంషి దీర్ఘ మాయుః కృణోతువా."

ఓ మనసా! బ్రహ్మ ఈ వధువును నాకు భార్యగా సృష్టించెను. నన్ను ఈ కన్యకు భర్తగా సృష్టించెను. ఆ బ్రహ్మదేవుడు మాయిద్దరికి సకల సంపదలనిచ్చి, చిరాయు వ్యమును కలిగించుగాక!

ఫలప్రదానం : మనోరథ ఫలము నెరవేరుటకు, సత్సంతాన, సకల సౌభాగ్య ఫలప్రాప్తి కొరకు, పుత్ర పౌత్రాభివృద్ధికొరకు, పెద్దలకు పండితులకు తాంబూలము, పండ్లు దక్షిణ ఇచ్చి ఆశీర్వచనం పొందుతారు.

"సుమంగల రియం వధూరిమాగ్ం సమేత పశ్యత
సౌభాగ్యమస్యై దత్వాయాథాస్తం విపరేతన"

సుమంగళిగా చాలాకాలముందు ఈ వధువును మీరం దరు వచ్చి, చూచి ఈమెకు ఆయుష్యమును, సౌభాగ్య



మును ఇచ్చి మీమీ యిండ్లకు స్వేచ్ఛగా వెళ్ళండి.

అరుంధతీ నక్షత్ర దర్శనం : ముందుగా ధ్రువ దర్శనం దంపతులచేత చేయిస్తారు. ఈ మంత్రం చదు వుతారు.

"ధృవక్షితిర్ధ్రువయోని ర్ధ్రువమసి ధ్రువత స్థితమ్"
తరువాత ఈ క్రింది మంత్రం చదువుచూ అరుం ధతీ నక్షత్ర దర్శనం చేయిస్తారు.

"సప్తఋషయః ప్రథమాం కృత్తి కానా మరుంధతీం యద్ధ్రువ తాం హనిన్యుః. | షట్కృత్తికా ముఖ్య యోగం వహన్తీయ మస్మాకమేధ త్వష్టమీ"||

ధ్రువనక్షత్రం స్థిరంగా వుంటుంది. నూతన వధూవ రులు కూడా ధ్రువనక్షత్రం వలె నిశ్చలమైన మనస్తత్వా లతో స్థిరంగా వుండాలని, వధువు అరుంధతివలె మహా పతివ్రత కావాలని ఆకాంక్ష. అరుంధతి అనగా ఎట్టి పరిస్థి తిలోను ధర్మమునకు హాని కలిగించనిదని భావం. లోకంలో కామమునకు హద్దు ఏర్పరచి ధర్మరక్షణకు దీక్ష వహిం చిన ఆదర్శ దంపతులు అరుంధతీ వసిష్ఠులు. అరుంధతీ దర్శనం ద్వారా వరుని ఆయుర్దాయాన్ని లెక్కించవచ్చు నంటారు. ఆకాశంలో దూరంగా వున్న చిన్న నక్షత్రాన్ని

చూడగల్గినే శక్తినిలబట్టే వ్యక్తి ఆయుర్దాయాన్ని లెక్కగట్టే ప్రక్రియ భారతీయ శాస్త్రంలో వున్నది. అందుచేతనే "ఆయుర్దాయం తీరిన వానికి అరుంధతీ నక్షత్రం కనుపించదు" అంటారు. వశిష్ఠుడు జీవితంమీద విరక్తి చెంది నప్పుడు ఆయనను ఓదార్చి తిరిగి జీవితంమీద ఆసక్తి కలిగించిన సాధ్వి అరుంధతి. తాత్కాలికమైన కష్టాలేవైనా వస్తే అరుంధతీ వసిష్ఠులను ఆదర్శంగా తీసుకొని సుఖంగా, ధైర్యంగా వుండాలని భావం. నూతన దంపతులు కామమునకే ప్రాధాన్యమీయక ధర్మానికి ప్రాధాన్యమిచ్చి ఆదర్శ దంపతులుగా మెలగుటకు కావలసిన దీవనలు అరుంధతీ వసిష్ఠుల దర్శనం వల్ల పొందింపచేయుటయే మన పెద్దల ఉద్దేశ్యము.

**స్థాలీపాకం :** స్థాల్యాం పక్వాం స్థాలీపాకం. చిన్న గిన్నెలో వండేది కనుక స్థాలీపాకం అన్నారు. "పత్న్య వహంతి", అనగా వధువు వడ్లుదంచి బియ్యముచేసి, ఆ అగ్నియందే చిన్నగిన్నెతో అన్నము వండి హోమము చేయవలెను. వడ్లు బీజరాసులు, వీటికి మొలకెత్తే శక్తి వుంది. దంచి ఆ శక్తిని పోగొట్టి మనము తినుచున్నాము. ఇది జీవహింస, ఈ దోషము నివృత్తి కొరకు వైశ్వదేవము, స్థాలీపాకము మొదలగునవి చేయవలెను.



బియ్యాన్ని దంచటం, కడకటం, వండటం మొదలైన పనులన్నీ ఆమె చేసే తీరు, వంట తెలుసా లేదా? వండే పద్ధతి, పొదుపరితనము, నిదానము మొదలగు విషయాలన్నీ గమనించబడతాయి. స్థాలీపాకమైన గాని దంపతుల వివాహము పూర్తిగాదు.

**ఔపాసన :** ఈ వధువుతో కలిసి అగ్ని వుపాసన ప్రారంభించుచున్నాను. జీవితాంతం ఈ ఔపాసన చేయుదుము అని వధూవరులు ప్రమాణం చేస్తారు. ఇక్కడ నుండి అగ్నిహోత్రం ప్రతిరోజు చేయాలి. బ్రహ్మచారిగా వున్నప్పుడు "అగ్నికార్యం" చేస్తాడు, ఇప్పుడు "ఔపాసన" చేస్తాడు.

**గంధర్వస్థాపనం :** స్థాలీపాకము, నిత్య ఔపాసన పూర్తి అయిన తరువాత మూడురాత్రులు దీక్షతో భార్యాభర్తలు ఉప్పుకారములేని భోజనంచేస్తూ, తియ్యని పదార్థాలు తింటూ, బ్రహ్మచర్యమవలంబించి, క్రిందపడుకోవాలి. ఒకే పాత్రలో భోజనంచేసి, ఒకేశయ్యపై పడుకోవాలి. మేడి కొమ్మకు దర్భలు చుట్టి అలంకారంచేసి దానియందు గంధర్వుని ఆవాహనచేసి, ఇద్దరి మధ్య దీనిని ఉంచుకొని పడుకోవాలి. మూడురోజులు ఇద్దరకు ఒకేవస్త్రం, ఒకేశయ్య, ఒకేపాత్ర యందు భోజనం వుండాలి. ఒకే

వస్త్రం అంటే ఇద్దరి వస్త్రముల కొంగుముడివేస్తే ఒకే వస్త్రంగా భావిస్తారు. ఈ దీక్ష వధూవరుల సంయమమునకు పెద్ద పరీక్ష. ఒకేచోట, ఒకే శయ్యపై పడుకొని క్రొత్తదంపతులు బ్రహ్మచర్యాన్ని పాటించాలి. నాల్గవరోజు రాత్రికి ఈ గంధర్వునికి ఉద్వాసన చెపుతారు. తరువాత శేష హోమం జరుగుతుంది. అగ్నిని, గంధర్వుని, సోముని ఆరాధించడం ద్వారా వరుడు కన్యను తనకు ఇచ్చినందుకు వారికి కృతజ్ఞత తెలువుకుంటాడు.

శేషహోమం : వివాహానికి సంబంధించిన హోమములలో ఇది చివరిది. దీనిలోని కొన్ని మంత్రాలు "అవశ్యన్త్వామనసా చేకితానం తపసోజాతం తపసో విభూతం. ఇహ ప్రజామిహరయిగ్‌ం రరాణః ప్రజాయస్వ ప్రజయా పుత్రకామ"

వధువు– నిన్ను నా అభిప్రాయము తెలిసినవానిని గాను, మంచి సంస్కారంతో పుట్టినవానివిగాను. మంచి నియమాలతో పెంచుకున్న తేజస్సుగల వానివి గాను, నేను గ్రహించాను. ఓ సంతానాభిలాష! నీవు నాలోన సంతానాన్నిగని, సిరిసంపదలనిచ్చి సుఖపడుము.

ఇద్దరు–"సమంజంతు విశ్వేదేవాస్సమాపో హృదయానినౌ. సంమాతరిశ్వా సంధాతా సముదేష్ట్రీ దిదేష్టునౌ"



విశ్వదేవులు, పవిత్రజలాలు, వాయువు, బ్రహ్మ మన మనస్సులను ఎల్లప్పుడూ స్నేహంతో కూడునట్లు చేయుదురు గాక! సరస్వతి మనమెప్పుడూ అనుకూలంగా మాట్లాడుకొనేటట్లు చూచుగాక. తరువాత అనురాగ సమావేశం అని గర్భాధాన సంస్కారానికి సంబంధించిన మంత్రాలు పఠించబడును.

"పుత్రిణే మాకు మారిణా విశ్వమాయు ర్వ్యశ్నుతం. ఉభా హిరణ్య పేశసా వీతిహోత్రా కృతద్వసూ దశస్యంతా మృతాయుకం"

పెద్దలు అంటారు– ఈ నూతన దంపతులిద్దరును, కుమారులు, కుమార్తెలు కలిగి పరిశుద్ధమైన బంగారుకాంతితో, మంచిపనులు చేస్తూ, సిరిసంపదలు సంపాదించి మంచి ఆయుర్దాయాన్ని పొందుదురుగాక!

నాకబలి : దీనినే నాగవల్లి అని అంటూ వుంటారు. ఈ కార్యక్రమం 5వ రోజు జరుపుతారు. భూమిని ఆవుపేడతో అలికి అయిదు రంగులతో చిత్రకం బలివలె ముగ్గులు పెట్టాలి. దానిచుట్టూ అలంకరించిన మట్టిపాత్రలను పెట్టాలి. వాటిచుట్టూ తొమ్మిది పోగులు గల దారమును చుట్టవలెను. నాలుగు మూలలయందు దీపములు (దీపారాధన) పెట్టవలెను. అరంగవల్లి చుట్టూ

వధూవరులు మూడు ప్రదక్షిణాలు చేసి, తూర్పుముఖ ముగా కూర్చొని అగ్ని, వాయువు, సూర్యుడు, చంద్రుడు, రుద్రుడు, విశ్వేదేవులు, బృహస్పతి, ఇంద్రుడు, వరుణుడు మొదలగు ద్వాదశదేవతలకు ప్రార్థన చేస్తారు. తొమ్మిది పోగులు కలిపిన దారమును సంతానము లేని దంపతు లకు ఇస్తే వారికి సంతానం కలుగుతుంది అని చెప్తారు. తరువాత దంపతులు రంగవల్లిపై కూర్చొని నల్లపూసలు, గౌరీదేవిపూజ చేస్తారు. నల్లపూసలు వధువు మెడలో ధరింపజేస్తూ ఈ మంత్రం చదువుతారు.

"నీలలోహితే భవతః కృత్యా సక్తిర్వ్యజ్యతే
ఏధన్తే స్యా జ్ఞాతయః పతిర్బంధేషు బధ్యతే"

శచీపూజ : ఇంద్రుని భార్యయగు శచీదేవిని, ఇంద్రుని కూడ ప్రార్థన చేస్తారు.

"దేవేంద్రాణి నమస్తుభ్యం దేవేంద్ర ప్రియభామినీ
ఐశ్వర్యం ధనమారోగ్యం పుత్రలాభంచ దేహిమే."

దేవేంద్రుని ప్రియురాలవగు నీకు నమస్కారము. ఐశ్వర్యం, ధనం, ఆరోగ్యం, సంతతి కలిగింపుము. ఈ శ్లోకము చదువుతూ వధూవరులచేత "కమ్మ-కడియం" అని బంగారు వెండి వాటిని నీటిబిందెలో వేసి మూడు సార్లు తీయిస్తారు. ఇందులో ఎవరికి బంగారం లభిస్తే



వారు గొప్పగా భావిస్తారు.

పాన్పు : దీక్షావిసర్జనమైన తరువాత (రక్షాబంధ నాన్ని విప్పివేసిన తరువాత) పాన్పుపైన వధూవరులను కూర్చుండబెట్టి వారిద్దరిచేత దంపతులకు తాంబూలములను ఇప్పించెదరు. వధువు స్త్రీకి, వరుడు పురుషునకు తాంబూ లమిస్తారు. దంపతులలో పురుషునికిచ్చిన తాంబూలమును వధూవరులు చూచుచుండగనే తన భార్యకిచ్చివేయుచుం డును.

మనువు పురుషుడు సంపాదించినదంత భార్యకిచ్చి కావలసిన డబ్బు ఆమెనుండి తీసుకొని ఖర్చుచేసి మిగి లినది ఆమెవద్దనే నిలువ చేయవలెనని చెప్పెను. మేమం దరము మనువు చెప్పినట్లే చేస్తున్నాము మీరు కూడా మావలెనే చేయండని బోధించటానికే అలా చేస్తున్నారు అని పెద్దలంటారు.

దంపతుల ఆశీర్వాదము వలన నవదంపతులు చక్కని దాంపత్యమును గడుపుదురని భావన. పెండ్లికి వచ్చిన వారిలో ఎవరెవరు దంపతులో కూడా తెలియనివారికి పరి చయం చేసినట్లు కూడా అవుతుంది దంపతి తాంబూ లాలవల్ల.

తరువాత బొమ్మను ఊయలలో ఊపించి, డోలపాట

పాడి ఆ బొమ్మను ఆడపడుచుకు వప్పగిస్తారు. ఆమె కోరిక తీరుస్తారు.

అప్పగింతలు : కన్యాదాత వధువును వరునకు వప్పగిస్తూ అంటాడు-

"అష్టవర్షా భవేత్ కన్యా పుత్రవత్పాలితా మయా
ఇదానీం తవ దాస్యామి దత్తా స్నేహేన పాలయ"

పుత్రునితో సమానముగా పెంచబడిన, 8 సం.లు వయస్సుగలదైన ఈ కన్యను నీకిచ్చుచున్నాను. నీవు యీమెను ప్రేమాభిమానములతో కాపాడుము. అత్తమామలకు వప్పగిస్తూ మీ పుత్రికవలెను, ఆడబిడ్డకు వప్పగిస్తూ నీ సోదరివలె చూచుకొమ్మని అంటారు. అప్పగింతల సమయంలో కంటతడిపెట్టని వారుండరు. "పోయిరాగదమ్మ జానకి" అని పాట ప్రారంభించగానే ఆర్ధ్రకమైన వాతావరణం ఏర్పడుతుంది. కణ్వుడు మహర్షి అయివుండి కూడా పెంచిన మమకారంచేత శకుంతలను అత్తవారింటికి పంపుచూ ఎంతో బాధపడతాడు. విరాగియైనవాని స్థితే ఇలా వుంటే కని, పెంచి, పెద్దచేసి, విద్యాబుద్ధులు నేర్పించిన తల్లిదండ్రుల స్థితి చెప్పనక్కరలేదు. కణ్వ మహర్షి శకుంతలకు ఇచ్చిన ఉపదేశ వాక్యాలు అత్తవారింటికి వెళ్ళే ప్రతి స్త్రీకి ఆచరించదగినవి.



ఆశీస్సులు : నూతన వధూవరులకు వాక్శుద్ధి గల పెద్దల, పండితుల వైదిక ఆశీర్వచనమువల్ల అన్ని దోషాలు పోయి, ఆయురారోగ్యాలు, భోగభాగ్యాలు కలుగుతాయి.

"అభివర్ధతాం పయసా రాష్ట్రేణ వర్ధతాం
రయ్యా సహస్రపోషసే మాకాస్తా మన క్షేతా"

ఈ వధువు పాడిపంటలతోను, ఇండ్లతోను, భూములతోను, సంపదలతోను, సకల సౌభాగ్యాలతో తులతూగుతూ మాకందరికీ అభివృద్ధి కలిగించాలి. ఈ దంపతులు సకల సంపదలతోను, సర్వ సమృద్ధులతోను, దేనికి ఇతరులపై ఆధారపడకుండా వుండాలి.

సర్వేజనా స్సుఖినోభవంతు
ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

## విశ్వ ధర్మ పరిషత్

1. ఆవిర్భావం : దాదాపు మూడు సంవత్సరాల కాలంలో వేలాది మంది ప్రజలమధ్య జరిగిన భావ వినిమయ మహాయజ్ఞ పర్యవసానంగా ఒక సంస్థ యేర్పడడం

అపూర్వం. ప్రజలలోనుండి, ప్రజలకొరకు, ప్రజలయొక్క క్షేమానికై ఆవిర్భవించిన మహోద్యమం విశ్వధర్మ పరిషత్. దీనికి ప్రారంభం నుండి స్ఫూర్తిదాత, కేంద్రస్థానం, చోదకులు, మాన్యులు శ్రీ గోపరాజుగారనేది నిర్వివాదాంశం. కాని వారే దీనిని స్థాపించారనేది సత్యదూరం. అనేకమంది ఆలోచనలు కలిపి సమిష్టి రూపాన్ని యిచ్చిన మహాశిల్పి మాత్రమేవారు. అందుకే యిది స్వయంభూ. ఈ సంస్థకు వారు మార్గదర్శకులు.

2. నామకరణం : పుట్టుక యెప్పుడో తెలియని యీ సంస్థ పెరుగుతున్నకొద్దీ వేరువేరు పేర్లతో కొన్నాళ్ళు పిలువబడింది. చివరకు 1989వ సంవత్సరం నవంబరు 17వ తేదీన గుంటూరులోని శ్రీ రామనామ క్షేత్రంలో, శ్రీరామ పాదసన్నిధిలో స్థిరమైన నామకరణం జరిగింది

**3. లక్ష్యాలు :**

1) ధార్మిక చైతన్యం
2) జాతీయ సమైక్యత
3) స్త్రీకి సమాజంలో గౌరవస్థానం
4) యువతాశక్తిని మేల్కొలపడం



**4. ప్రత్యేకతలు :**

1) సామాన్య వ్యక్తులలో కలిగిన ఆలోచనలలో నుండే మహత్తరశక్తి ఉద్భవించి సమాజాన్ని పునీతం చేయాలి.
2) వైవిధ్యాన్ని అంగీకరించాలి. వైరుధ్యాన్ని తొలగించాలి. ఏకత్వాన్ని సాధించాలి.
3) వ్యక్తికంటె సంస్థ, సంస్థకంటె సమాజం గొప్పది. సమాజ సేవకే జీవితం అంకితం కావాలి

**5. కార్యక్రమాలు :**

1) నిత్య కార్యక్రమాలు : వ్యక్తులను సంస్కరించి ఉత్తములుగా రూపొందించేందుకు సత్సంగాలు.
2) నైమిత్తిక కార్యక్రమాలు : సమాజ నడవడిలో యోగ్యమైన మార్పు తేవాలనే సంకల్పంతో రామాయణ, భారత, భాగవతాదుల ప్రచారం.
3) నియబద్ధ కార్యక్రమాలు : ఉత్సవాలు, పండుగలు, వేడుకలు, జాతరలు, తిరునాళ్ళు, ఆచారములు మొదలైన వాటిలోవున్న సాంప్రదాయిక, శాస్త్రీయ దృక్పథాన్ని బోధించి ధార్మిక భావోద్దీపన కలిగించడం.
4) శారీరక కార్యక్రమాలు : యోగాసనాలు, సూర్యన

మస్కారాలు, చక్కభజనలు, కోలాటాలు, ఆటలు వ్యాయామము మొదలైన వాటి ద్వారా శారీరక దారుఢ్యాన్ని పెంచడం.

6. ఆశీస్సులు :

1) పూజ్యులు, జగద్గురువులు, శృంగేరి పీఠాధిపతులు శ్రీ భారతీ తీర్థ మహాస్వాములవారు.
2) పూజ్యులు శ్రీ త్రిదండి లక్ష్మీ నారాయణ చిన్నజీయర్ స్వాములవారు.
3) పూజ్యులు శ్రీ విశ్వయోగి విశ్వంజీ.
4) పూజ్యులు శ్రీ ప్రణవానందగిరి స్వామివారు
5) పూజ్యులు శ్రీ బ్రహ్మనిష్ఠానందసరస్వతి స్వామివారు
6) పూజ్యులు శ్రీ లలితానంద సరస్వతిస్వామినివారు

విజ్ఞప్తి: విశ్వధర్మ పరిషత్ కార్యక్రమాలను ప్రోత్సహించండి. కార్యకర్తలుగా కార్యక్రమాలను నిర్వహించండి. కార్యరంగాన్ని విస్తరింపచేయండి. సభ్యులుగా చేరండి. దాతలుగా సహాకరించండి. వక్తలుగా విచ్చేసి ధర్మ ప్రచారంలో తోడ్పడండి. ఈ సంస్థను మీదిగా చేసుకోండి.

కదలండి. కదిలించండి. కదలిరండి.

సర్వేజనా స్సుఖినో భవంతు

# పెళ్ళినాటి ప్రమాణాలు !

**"ధర్మార్థ కామేషు త్వయైషా నాతి చరితవ్యా"**

"ధర్మ, అర్థ కామములనే పురుషార్థాలను సాధించుటలో ఈమెను (వధువు)ను అతిక్రమించి ప్రవర్తించకు" అని కన్యాదాత వరునితో అంటాడు.

**"నాతి చరామి"** "అతిక్రమించను" అని వరుడు అందరి ముందు ప్రమాణం చేస్తాడు. (ఇది జీవితంలో మరిచిపోరాదు)

**"సఖాసప్తసదాభవ...సముచిత్తాన్యాకరం"**

ఓ భార్య! మనం స్నేహితులుగా వుందాం. నేను నీ స్నేహాన్నుంచి ఎప్పుడు విడిపోను మనం కలిసి తిందాం, కలిసి వుందాం, కలిసి ఆలోచించుకుందాం, కలిసి నిర్ణయించుకుందాం, కలిసి నడుచుకుందాం, బాహ్యేంద్రియాల విషయంలో కూడా కలిసి వుండేటట్లు నడుచుకుందాం.